మునిమాణిక్యం నాటికలు

(1 జయమ్మ కాపురం. 2 ఎలోప్ మెంటు)

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

పబ్లిషర్సు :

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో,

రాజమండ్రి

వెల
రూపాయి

మొదటిముద్రణ 1950
రెండవముద్రణ 1955

శ్రీ కొండపల్లి ముద్రాశాల
రా జ మం డ్రి

జయమ్మ కాపురం

ప్రథమాంకం—ప్రథమరంగం

(జయమ్మ పుట్టినిల్లు పెద్దబజారులో ఇల్లు- ఇంటికి ముందున్న పోర్టుకోలో, అక్క చెల్లెండ్రు, మీన జయానూ వాళ్ళతల్లి శాంతమ్మానూ కూర్చుని మాట్లాడుకుంటూ వుంటారు)

జయ—అమ్మా. ఏదైనా మంచి పాట పాడవే.

శాంతమ్మ—నాకేం పాటలొచ్చే పిచ్చితల్లీ ! చిన్నప్పుడు నేర్చుకొన్నవి ఏమైనా వచ్చినా, అవన్నీ పాతపాటలు! నచ్చుతాయమ్మా మీకూ ?

జయ—నచ్చకేమి ! అవే బాగుంటయి నిజానికి !

మీన—ఆ నచ్చుతై ! నచ్చకేం నీకన్నీ నచ్చుతై.! పాతచింతకాయ పచ్చడైనా కమ్మగానే ఉంటుందినీకు.!!

జయ—పోనీ నీవు పాడరాదమ్మా ఏదైనాకొత్తపాట

మీన—నాకు ఇంగ్లీషు పాట వచ్చు

శాంతమ్మ—పోనీ అదే పాడు వింటాము ఏదైతేనేం పాడటానికీ ?

జయ—పాడవే.

మీన—పాడతాను విను.

There are ten green bottles hanging on the wall
Hanging on the wall
If one green bottle happens to fall
There are still nine green bottles hanging on the wall

(శాంతమ్మ తెల్లపోయిచూస్తూ ఉంటుంది. జయ విని విరగ బడి నవ్వుతుంది)

జయ—ఇదేం పాటే?

శాంతమ్మ—ఇప్పుడు నీవు ... పాడింది పాటటే అమ్మాయీ!!

జయ—పాటేనే ... (నవ్వి) ... ఇంగ్లీషు పాటలు అల్లాగే ఉంటై ...... ఇకచాలుగాని అమ్మా అధ్యాత్మ రామాయణ కీర్తన ఒకటిపాడవే.

శాంతమ్మ—దానికేంభాగ్యం... పాడతానమ్మా....

(కృష్ణుని చల్దులు పాడుతూఉంటుంది)

మీనా—అమ్మా ... అమ్మా ... పోస్టుమన్ వస్తు న్నాడే!! ఉత్తరం ఏమైనా ఉందేమో! మాస్టరు గారింటికి వెళ్ళాడే అమ్మా. మనకేమైనా ఉత్తరం ఉందేమో అడగనా?

శాంతమ్మ—పిచ్చా ఏమిటే నీకూ? మన కిపుడు ఎవరు వ్రాయాలె! అక్కయ్యకూడా ఇక్కడే ఉందాయె!!

మీన—(కొంటెగాచూస్తూ) ఏమె జయక్కా! ఎక్కడనుంచి అయినా ఉత్తరం రావాలా?

జయ—(సిగ్గుపడి) ఏమోనే నన్నడిగితే నాకేం తెలుస్తుందే!

మీన—అబ్బ! ఎంతనంగనాచివే!! బావ దగ్గరనుంచి ఉత్తరం వస్తుందేమోనని నీవు అనుకోలా!! నవ్వొతుంది పైగా! అమ్మా చూడవే ఎట్లా నవ్వుకొంటున్నదో...... నా మాట అబద్ధమేమో!!

శాంతమ్మ—పోనీ లేవే......అల్లరి చేయకూ.

జయ—వెళ్ళి పోయినాడా?

మీన—పోయినట్లే...ఉన్నాడు— (సందేహంగా) అడుగో......వస్తున్నాడు!! ఉత్తరం ఏమైనా ఉందేమో అడగనా?

శాంతమ్మ—అడగటం ఎందుకే? ఉత్తరం ఏదేనా ఉంటే అతనే ఇచ్చిపోతాడు! పట్టు కెళ్తాడా?

మీన—(ఎగురుతూ) ఇటేవస్తున్నాడు!

(జయ లేచిచూస్తుంది) మనఇంటికే! నవ్వుతున్నాడుకూడానూ అమ్మా అమ్మా. రావే. రావే ఏమే అమ్మా మనఇంటికే వస్తున్నాడే!!

శాంతమ్మ—రానీయవే!! ఎందు కట్లా ఎగురుతావు!!

మీన—ఏం అబ్బాయి, మాదేనా ఉత్తరం? నే జెప్పలా? నాకు తెలుసూ! ఇది బావ రాసిందేనా అక్కయ్యా!!

జయ—ఇల్లా...ఇయ్యి(అనివుత్తరంలాక్కోబోతుంది మీన పారిపోతుంది.)

మీనా—ఆ ... నే నియ్యను ... అమ్మా బావ రాసిందేనే!...

శాంతమ్మ—నీకెల్లా తెలుసే ఎవరు వ్రాసిందీనీ... ఒక వేళ మీనాన్నగారి ఉత్తరమేమో చింపబోకు సుమీ

మీనా—(అడ్రసుచూస్తూఆశ్చర్యంగా) నాన్న పేరుందే

శాంతమ్మ—అయితే బల్లమీద పెట్టేశెయ్యి

జయ—(తెల్లపోయి) నాన్నదా?

మీనా—(లేగదూడలాగ ఛంగున గంతేసి) కాదేవ్. అమ్మా నాన్నగారి కేరాఫ్ జయలక్ష్మి అని ఉందే! అక్కయ్యకేనే! ఇంకేం! బావరాసిందేనే! నే జెప్పలా?

జయ—(సంతోషంతో) ఇల్లా ఇయ్యి అల్లరి చెయ్యకా (అని మీనచేతిలోనుంచి ఉత్తరం లాక్కోబోతుంది. మీన—అందకుండా పరుగెత్తుతుంది)

మీనా—ఇందవే...నాకెందుకు నీ వుత్తరం. (అని నిల బడుతుంది. జయ అందుకుంటానికి వెళ్ళగానే) అమ్మా ఎంతాశే (అని దూరంగా నుంచుని ఎగురుతుంది సంతోషంతో)

శాంతమ్మ—మీనా, ఏమిటా ఎగురుడూ? దాని మొగుడు వ్రాసిన ఉత్తరం అంటే, దానికి ఆశ గదూ!

మీనా—ఆశేలే.....చింపనా...చింపుతా

శాంతమ్మ—అక్కయ్య కియ్యవే మీనమ్మతల్లీ

మీనా—చింపుతున్నా నేవ్...... చింపు......తు ...... న్నా ......ను ...... (చింపబోతున్నట్లు నటిస్తుంది)

జయ—వద్దని నీకు కాదూ చెప్పేది? ఇల్లా ఇస్తావా ఇయ్యవా! (మీన పాలుత్రాగిన ఆవుదూడలాగ గంతు లేస్తుంది. జయ నిలబడి చూస్తుంటుంది)

మీన—నీ మొగుడు వ్రాసిన ఉత్తరం అయితే మటుకు ఎందుకమ్మా అంత ఆశా?

శాంతమ్మ—నీకూ మొగుడు వస్తేగాని తెలియదు, ఆ ఆశ ఏమిటో! నీవు చించి చూడ కూడ దమ్మా అక్కయ్యకు ఇచ్చెయ్యి.

జయ—ఇల్లా ఇచ్చెయ్యి నా అమ్మగదూ

మీన—(తల్లిదగ్గరకు వచ్చి) నేను చదువుతానే అమ్మా, (తగ్గుగొంతుకతో)

శాంతమ్మ—అక్కయ్యకు ఇచ్చెయ్యి అని చెప్పానా ...ఎందుకు చెప్పానో...వినాలె. (బ్రతిమలాడుతుంది)

మీన—ఇందవే......నీ మొగుడు వ్రాసిన ఉత్తరం నీవే చదువుకో నాకేం వద్దులే అమ్మా (అని ఇయ్యబోతుంది)

జయ—(అందుకోబోతే...మీన......ఇస్తున్నట్లు నటించి చెయ్యి వెనక్కు లాక్కుంటుంది అమ్మా అంటూ) అబ్బ, ఏడిపించుకు తింటున్నావు! పోనీ నీవే చదవ్వే.

మీన—(బుద్ధిమంతురాలై సీరియస్ గా) నీ మొగుడు రాశాడుగా నువ్వే చదువుకో. ఇందమ్మ నీ ఉత్తరం: (బుడ్డ మూతితో ఇచ్చేస్తుంది)

౨

(అదే స్థలం, జయ ఉత్తరాన్ని అందుకొని ఒకమూలగా ఒదిగి కూర్చుని జాగ్రత్తగా, నెమ్మదిగా చింపి, ఉత్తరాన్ని తీసి చదువుకోవటం ప్రారంభిస్తుంది. శాంతమ్మ కుమార్తె వంక దీక్షతో చూస్తూ, సంతోషిస్తుంటుంది.

ఉత్తరంలోని మొదటిపంక్తి చదివే సరికే జయకు అప్రయత్నంగా నవ్వు వస్తుంది. దీక్షగా ఉత్తరం చదువు కొంటూ ఉంటుంది.

మీనా మెల్లగా జయ వెనకవైపునకు జేరి మోకాళ్ళ మీద కూలబడి, జయ బుజాలమీదుగా చూస్తుంది. ఆ ఉత్తరం చూసి ఆశ్చర్యపడుతుంది. ఏదోరహస్యమైన సంగతి తెలుసుకొన్నదానిలాగ చూస్తుంది. కళ్ళు పెద్దవిచేస్తుంది. పెదవి లోపలకిలాగి పడుతుంది. ఏదో అద్భుతమైన, విచిత్ర మైన రహస్యాన్ని తాను సంపాదించినందులకు పట్టరాని సంతోషంతో. మెల్లగా లేచి, అడుగులో అడుగు వేసు కొంటూ నడచివెళ్ళి; తల్లి చెవిలో ఏమో చెపుతుంది ఆమె నవ్వుతుంది.

మీనా మళ్ళి జయక్క వెనకాలచేరి ఇందాకటి మాది రిగా చూడాలని ప్రయత్నం చేస్తుంది. కాని ఈమారు జయ ఉత్తరాన్ని దాచుకొని, మీనకు కనపడని పద్ధతిలో చదువు కొంటూ ఉంటుంది మీనా చిన్నపుచ్చుకొని జయ తనను అవమానపరచి నందులకు కోపంగా ఉంటుంది.

కాసేపు అయిన తరువాత మీన తల్లిదగ్గర కెళ్ళి, మళ్ళీ ఏదో చెప్పాలన్న ప్రయత్నంలో అమ్మా, అమ్మా అని గడ్డం మునివ్రేళ్ళతో నెట్టుతుంది. శాంతమ్మ వినిపించుకోకుండా జయమ్మ ఉత్తరాన్ని చదువుకోటంమాది ఆనందిస్తూ ఉంటుంది మీన ఊరుకోదు. పీకి పీకి ఆమెదృష్టి తన వైపునకు త్రిప్పి, మళ్ళీ చెవులో ప్రియమైన జయమ్మకే అమ్మా'' అంటుంది.

మీన—ఉత్తరం చూడ నీయవుకదూ......... నే చూశా లే......అమ్మా.........ప్రియమైన జయకే! (నవ్వుతుంది)

శాంతమ్మ—సరే చెప్పావుగా అమ్మా.

మీన—(మరుసారి ఉత్తరం చూడాలని ప్రయత్నం చేసి) పోనీలే అమ్మా నాకు చూపొద్దులే. అసలు చూడనే చూడనూ! (బుడ్డమూతి పెడుతుంది. ప్రియమైన జయకు... ప్రియమైన జయకు...(అనేకరకాలుగా నొక్కి సాగదీసి ఆ మాటలో ఉండే మాధుర్యానంత వలకపోస్తుంది)

ఒక అమ్మాయి మొగుడు ఏమన్నా......పెళ్ళానికే.........(నవ్వు)-''ప్రియమైన జయా'' అని ఉత్తరం రాశాడు.

రత్తమ్మ—(ఇంటిప్రక్క ఆవిడ. ముసలి ముత్తైదువ. వస్తుంది) ఏమమ్మా శాంతిమ్మవదినా...ఏమిటి సంగతీ?

శాంతమ్మ—రా వదినా...రా...మరేం సంగతులు లేవు...

రత్తమ్మ—మీనా ఎందుకూ అట్లా ఎగురుతుంది ?

మీనా—ఏం లేదు అత్తయ్యా...............
ఒకమ్మాయి మొగుడూ......(నవ్వు)

రత్తమ్మ—ఎందుకే అంత నవ్వా ?

జయ—దానిసంగతి ఎరగవు అత్తయ్యా అది అంతే!

శాంతమ్మ—దాని మొగుడు ఉత్తరం వ్రాశాడు; అది చదువుకొంటున్నది. అదీసంగతి అంతకంటే మరేంలేదు.

రత్తమ్మ—దాని మొగుడు వ్రాసిన ఉత్తరం అది చదువుకొంటూంటె...ఇదెందుకూ ఇట్లా ఎగురుతుందీ !

మీనా—అదిగాదు...అత్తయ్యా...(నవ్వు ఆపుకోలేక విరగబడి నవ్వుతుంది.)

రత్తమ్మ—ఏమిటే... పిచ్చిపిల్లా ... సంగతేమిటో చెప్పి మరీనవ్వా.

మీనా—అది కాదు అత్తయ్యా... బావే... అక్కయ్యకు ఉత్తరం వ్రాశాడు—(మళ్ళీనవ్వుతుంది.)

రత్తమ్మ—రాస్తేఏం; మొగుడు పెళ్ళానికి ఉత్తరం రాసుకోట్టే ! ఎందుకానవ్వా ?

మీనా—ఉత్తరానికి కాదు అత్తయ్యా...మరిటా ......(నవ్వు)...పెళ్ళాంటా......ప్రియమైన జయటా !! (పక్కలు పట్టుకొని విరగబడి నవ్వుతుంది)

రత్తమ్మ—ఓస్......ఇంతేగద! అబ్బురమావిమిటి ? ఈమాత్రానికే ఎందుకే అంత ఎగురుడూ ? నీకూ వస్తా

ముండు... వెక్కిరిస్తూన్నావు! నీ మొగుడు ఏం రాస్తాడో ఆలోచించుకో!

మీన—నాకు మొగుడు లేడుగా!

రత్తమ్మ—లేకపోతే రేపీపాటికి వస్తాడు. వచ్చి...

మీన—ఆ...వచ్చి...వచ్చి ఏంజేస్తాడు? చెప్పు?

రత్తమ్మ—ఆఁ వచ్చి ఏంజేస్తాడా? వచ్చి మెత్తగా తంతాడు...సరేనా?

మీన—అట్లయితే...నేను...అసలు పెండ్లి చేసుకోనుగా.

రత్తమ్మ—మాచక్కా చేసుకొంటావు! నీవు చేసుకొంటావా నీతల్లో జేజెమ్మ చేసుకొంటుందా!

మీన—ఆ...చూద్దాం..."వలదు...వలదు. వివాహంబు వలదు నాకు విశ్వలందే సుఖము వెలయునాకు"

రాదే...చెలీ

నమ్మరాదే చెలీ

మగవారిని...నమ్మరాదే చెలీ (అంటూ పరుగెత్తిపోతుంది.)

శాంతమ్మ—నీకొడుక్కు చేసుకోవమ్మా దీన్ని.!

రత్తమ్మ—నాకొడుక్కు చేసుకొంటే ... ఈగడుగ్గాయ సరిగ్గా కాపురం చేస్తుందనే నీవనటం! ఇప్పుడే ఇట్లా ఎగురుతున్నదే గజ్జల గుఱ్ఱంలాగ? ఈడొస్తే ఇహానిలుస్తుందంటావా? వాణ్ణి కానికి అమ్ముకొస్తుంది గాని! సరేగాని ఇంతకూ అల్లుడు ఏం రాసినట్లు?

శాంతమ్మ— ఏదీ...? ఏమమ్మా జయా...ఏంరా శేడే? మేము వినొచ్చా? (అని పక్కావిడను చూచి నవ్వుతుంది)

రత్తమ్మ—పోనీ...ఉత్తరం...అంతా చదనొద్దులే అమ్మా...సంగతు లేమిటో చెప్పు. అంతేచాలునంతోషిస్తాం.

జయ—(నవ్వుముఖంతో) పెద్ద రహస్యాలు ఇందులో ఏమీ లేవే...అమ్మా నువ్వేచూడు. (ఉత్తరం తల్లికిస్తుంది)

శాంతమ్మ—(ఉత్తరాన్ని తలక్రిందుగాపెట్టిచూచి) అఁహ అక్షరాలు అలికేసి నట్లుగా ఉన్నాయి. నీవు చదువు వొదినా...వింటానూ.

రత్తమ్మ—(బారెడు దూరంలోపెట్టి) అఁహ నాకూ చూపు ఆనటంలేదు. కళ్ళజోడుకావాలె. ఎందుకాని ఇదంతానూ నువ్వేచదవ్వే...జయమ్మా...(అని ఉత్తరం జయ చేతికిస్తుంది)

మీనా—(ప్రవేశించి)...నేను చదువుతాను పోనీ ఇల్లా ఇయ్యిఉత్తరం అత్తయ్యా.

శాంతమ్మ—కాదులేఅమ్మా...దాన్నే చదవనీనువ్వు ఇల్లారా, తల్లీ...నాదగ్గరకూర్చో. అక్కయ్య చదువు తుంటే అంచక్కా విను. ఇహ చదువు తల్లీ చదవ్వేసిగ్గేమిటి?

రత్తమ్మ—ఓయబ్బ!...ఏంసిగ్గమ్మా! చదువమ్మా వింటాము.

జయ—సిగ్గుకాదే...చదువుతానే అమ్మా వినుమరి ఆవిడతో గుసగుసలాడతావేం...?

శాంతమ్మ—ఉఁ లేదులే...కానియ్

జయ — మీరిద్దరూ అలాగ ముసిము సినవ్వులు...... నవ్వుతూంటే... నేనేంచదివేదే !!

రత్తమ్మ — లేదు లేవమ్మా — ఊరుకో వదినా ఊ, కానీ.

జయ — (సిగ్గుపడి) నేను...........(నవ్వుతుంది)

శాంతమ్మ — (అంతా నవ్వుతారు)...నువ్వే నవ్వుతుంటివి! చప్పున చదివేశెయ్యి.....ఏముంది మహాభాగ్యం !!

జయ — ఉత్తరంచదువుతుంది) "నేను ఇక్కడకులాసాగా ఉన్నాను"

మీన — (లేచి) ఆఁ ఆఁ అది చదవ్వేం మొదట్లో వ్రాసింది!

రత్త — మొదట్లో వ్రాసిందేమిటే! ... పోనీ అది కూడా చదువు వింటాం

మీన — మొదట్లో, ప్రియమైనజయా అని వ్రాయలా ...(మళ్ళీనవ్వు)

శాంతమ్మ — అది విన్నాంగా ఇఁహ చదవనీ.

మీన — ఇహ చదవ్వే...(వెక్కిరింతగా)

జయ — నేను ఇక్కడ కులాసాగాఉన్నానుఁ మా అమ్మా నాన్నా గుంటూరు వెళ్ళారు. మా అక్కయ్యకు పురుడు వెళ్ళింతరువాత వస్తారట ।

శాంతమ్మ — ఎప్పుడో ప్పుడు వస్తారు ... ఇందులో ఏముందే...అల్లాగ నవ్వుతారు. ఏమమ్మా వదినా ఎందుకూ అల్లా నవ్వుతారూ !

రత్తమ్మ—ఏమో పిచ్చిపిల్లలు. ఊఁ ఇంకేఁ రాశాడే...
జయా...చదువు మరీ,

జయ—"నేను హోటల్లో భోజనం చేస్తున్నాను"!

శాంతమ్మ—ఇంకా ఇబ్బంది ఏముందీ!...ఏమమ్మా. హాయిగా హోటల్లో భోజనం చేస్తాడు! ఏమంటావు!

జయ—హోటలు భోజనం నాకేమీ సరిగా లేదు. (అని ఫక్కున నవ్వుతుంది)

శాంతమ్మ— ఎందుకే ఆనవ్వు...అంతా నవ్వుతున్నారే! ఏముందమ్మా ఇందులో ! !

మీన—(తల్లిబుగ్గమీదపొడిచి) నీకేం. అర్థంకాదు. బావడుత్తరంలో మొదట — మానాన్న అమ్మాలేరూ అని వ్రాయలే.

శాంతమ్మ—వ్రాస్తే

మీన—వ్రాస్తే నేనుఒక్కణ్ణే ఉండలేనూ...నీవు చప్పునరా అన్నమాట !

శాంతమ్మ—(ముక్కుపై వేలేసుకొని) అల్లాగటే!

మీన—అందుకని హోటలు భోజనం సరిగా లేదు

శాంతమ్మ—అందుకని భోజనం సరిగా లేకపోవటం ఏమిటే.

మీన—నీతలకాయ. నీకేం అర్థంగాదు. హోటల్లో అన్నం సయించటం లేదూ అంటే ఏమిటి?

శాంతమ్మ—ఏముందే

మీన—అక్కయ్య వెళ్ళి...వండిపెడితేగాని ...... ఆయనకు...అన్నం...సయించదట...ఇప్పుడు తెలిసిందా?

శాంతమ్మ—నాతల్లే, ఎంతఅర్థం ఉందే!! నాకేం తెలుస్తాయమ్మా ఈ అర్థాలన్నీనూ? నే నేమన్నా చదువు కొన్నానా, పెట్టానా?

మీన—దీనికేం చదువు అక్కర్లేదే ఇది కావాలె (నెత్తిమీద కొడుతుంది)

శాంతమ్మ—నాకు అదీ లేదూ...... ఇదీ లేదూ... జయమ్మా ... ఇంకా ఏమన్నాఉందా అయిపోయిందా... ఉత్తరం?

జయ—ఇంకా రెండు ముక్కలున్నాయ్ "పాల పున్నమ్మకు ఎంత ఇవ్వాల్సింది నాకు తెలియదు. అది డబ్బు కోసం రోజురోజూ తిరిగి పోతున్నది."

శాంతమ్మ—పాలపున్నమ్మ సంగతి ఎందుకమ్మా ఈఉత్తరంలో?

జయ—ఆ పాలదానికి ఎంత ఇవ్వాలో ఆయనకు తెలియదు! అది రోజురోజూ లెఖ్ఖకు గోలచేస్తున్నది కామోసు!!

శాంతమ్మ—ఏం విచిత్ర మమ్మా. లెఖ్ఖజూచుకొని ఇచ్చిపంప లేదూ?

రత్తమ్మ—నీదంతా ఓ వెర్రిగొడవా!! గ్రహించ లేవ్వూ? అదో నెపము!!

మీన—జయక్క వెళ్ళి లెఖ్ఖచూస్తే నేగాని తేలదు ఆచిక్కు. అదీ సంగతి!! తెలిసిందా?

రత్తమ్మ—ఇప్పుడు తెలిసిందమ్మా. ఈ ఉత్తరంలో సంగతంతా ఏమిటంటే...పెళ్ళాని తత్‌క్షణం తిరుగు టపాలో పంపమని.

మీనా—అక్కయ్యను తిరుగుటపాలో పంపెయ్యనే అమ్మా. అదికూడా ఆలస్యం కావచ్చు; టెలిగ్రాంమీద పంపేద్దాము అక్కయ్యని!!

జయ—(కోపం నటిస్తూ) మీనా, ఏమిటదీ ?

శాంతమ్మ—అంతేనుటే జయమ్మా అర్థం.

రత్తమ్మ—దాన్ని అడగాలటే ... తెలియటంలా ? (నవ్వు) హోటలులో భోజనం సరిగా లేదంటే అర్థం తెలియటం లేదటమ్మా వదినా ? (నవ్వు)

జయ—కాదులే...అత్తయ్యా ఆయనకు నిజంగా హోటలు భోజనం పడదు.

మీనా—అత్తయ్యా...ఇప్పుడు తెలిసిందా? జయక్క మాట విన్నావా ? దీనికీ ప్రేమేనా మొగుడంటే...ప్రియమైన మొగుడు ! (వెక్కిరిస్తుంది)

శాంతమ్మ—ఈ డొంక తిరుగుడు అంతా ఎందుకమ్మా? పోనీ...నీవు వెంటనే బయలుదేరి రా...అని వ్రాయకూడదూ ?

రత్తమ్మ—నీదంతా ఓ గొడవ అల్లా రాస్తారుటమ్మా ఇప్పటి కాలం కుఱ్ఱవాళ్లు అయితే మటుకు సాంప్రదాయంలో పెరిగినవాళ్ళు ఇల్లాగే వ్రాస్తారు వదినా !

శాంతమ్మ—చాలా తమాషాగా వ్రాశాడు ! గొప్ప అల్లుడే ! ఉత్తరం అయిపోయిందా అమ్మాయీ !

జయ—అయిపోయినట్లే. ఇంకా రెండుముక్కలున్నై.

రత్న— అవికూడా వినిపించవే జయా. ఇంకా ఏమి తమాషాలున్నయ్యో !!

జయ—తమాషాలు ఏమీ లేవు! అత్తగారికి మామగారికి నమస్కారములు మామరదల్ని చి॥ మీనాక్షిని చూడాలనిఉంది. చిన్నప్పటి దాని ముద్దుమాటలు జ్ఞాపకం వస్తూఉంటైయ్.

శాంతమ్మ—ఈభాష నాకూ అర్థం అవుతున్నది. అయితే దాన్ని కూడా తీసుకుని రమ్మనా ఆయన అనటం?

మీన—అది! అమ్మయ్యో...మాఅమ్మకు ఇప్పుడిపుడే తెలుస్తున్నాయి సంగతులు !!

రత్నమ్మ—ఒకవేళ మీరేమన్నా ఆటంకం చెబుతారని నమస్కారాలు కూడా పారేశాడు.

శాంతమ్మ—తమాషాగా ఉందే. అల్లుడు గడుసువాడుసుమీ. (నవ్వుతూ) హోటల్ భోజనం పడటం లేదూ? పాలలెఖ్ఖ చూడటం కూడా తెలియదు పాపం !!

జయ—కాదులే...అమ్మా... ఆయనకు నిజంగా తెలియదు. ఇటువంటిగొడవ లేమీ పట్టించుకోరు. అంతా నేనే !!

రత్నమ్మ—ఇంకెందు కమ్మా...దీని సంగతికూడా తెలిస్తూలా ఈమాటలో !!

శాంతమ్మ—ఇంకా తెలియకుండా ఉండాల్సిందే !! అంతా తెలిసింది. సరేలే... మీనాన్న రాని...... రేపే కామాలు దశమి...సరేజయా...రేపే బాగుంది.

మీన-(దీర్ఘాలుతీస్తూ) నేను...కూడా...వెళతానూ

శాంతమ్మ—దాని మొగుడింటికి నీవెందుకే ?

జయ—ఎక్కడా మొగుడు దొరక్కపోతే అక్క మొగుడే దిక్కు అన్నారు.

మీనా—నాకు మొగుడు దొరక్కేమే ? నేతల్చు కొంటే...ఒక్కటి...రెండు...మూడు...ముగ్గురు మొగుళ్ళున్నారు నాకు...(వేళ్ళమీద లెక్క పెడుతుంది)

రత్తమ్మ—ఎంత గడుసీఇది !

జయ—మీనా, వెళ్ళుదాంరా.

శాంతమ్మ—సరే.....అక్కయ్యా నీవూ బట్టలు సద్దుకోండి.

జయ—(ఉత్తరాన్ని రెవిక జేబులో పెట్టుకొని) రావే మీనా (వెళ్ళిపోతారు.)

శాంతమ్మ—జయమ్మ చూశావా వదినా ! దానికి వెళ్ళాలనేఉంది !!

రత్తమ్మ—ఇంత వెర్రిదానవేమమ్మా ఉండదుటమ్మా.

శాంతమ్మ—ఉంటుంది, ఉంటుంది, ఏదో కన్న కడుపు కాబట్టి...(రుద్ధకంఠం) అమ్మాయి మళ్ళీ అత్తవారింటికి వెళుతుందీ అంటే కష్టంగా ఉంటుంది.

రత్తమ్మ—ఏమిటి వదినా, (కన్నీరు) ఆడపిల్లలను కన్నాం, ఒక అయ్యచేతులో పెట్టాం, ఇక మన దేముంది చెప్పు ! అయినా దానికేంతక్కువ! అత్తవారింటిలో అయినా అది ఒక పనీ పాటా చేయక్కర్లేదు. జమిందారు బిడ్డలాగు గడుపుతుంది.

శాంతమ్మ—దానికేం తక్కువ వదినా. ఆ అత్తగారైనా, ఏమాట కామాటె చెప్పాలె...పార్వతీ దేవి లాంటిది, కోడల్ని ఇవతల చెంబు అవతల పెట్టనియ్యదు. కొడుకూ కోడలూ చిలకా గోరింకల్లా ఉంటే చూచి సంతోషిస్తుంది.

రత్తమ్మ—అదే మనకు కావల్సింది! జయమ్మ కడుపు ఫలించి నాలుగు పూలూ నాలుగు కాయలూ కాస్తే...

శాంతమ్మ—ఆఁ అంతే.....వదినా...... అంతే అంతకంటే కావల్సిందేమిటి!

రత్తమ్మ—(తగ్గుగొంతుకతో) అవునుగాని...వదినా ఏమన్నా ?..........

శాంతమ్మ—ఏచ్చే......ఏదీ......

రెండవరంగం

[పడకగది-ఒకపక్కగా ఒకబల్ల-దానిపైని పుస్తకాలు చిందరవందరగా పడేసి ఉంటై. ఏవస్తువూ ఉండవలసిన చోట ఉండదు. బాబు ఆగదిలో ఒంటరిగా ఉంటాడు. బాబు జయభర్త; మోచేతులు వరకు ఉన్న చొక్కా. కొంచెంవిసుగ్గా, విచారంగా ఉంటాడు. ఇంతలోకి చాకలిది వస్తుంది.]

చాకలి—బాబయ్యా.

బాబు—ఆ—ఎవరూ ? నీవా...చాకలీ...బట్టలు తెచ్చావా...రా.

చాకలి—తెచ్చానండి బాబయ్యా...పద్దుచూస్తే... దాని ప్రకారం అప్ప జెపుతానండి.

బాబు—అదే...అదే చూస్తున్నానే ఎక్కడా కనిపించటంలేదు...ఎక్కడ పెట్టెళ్ళిందో ఆ మహారాణి! ఇంటికైన ఆడది లేకపోతే చూశావ్రా...చాకలీ...ఏమీ కనపడదు...

చాకలి—అంతేనండి బాబయ్యా, మొగోరికేం కనబడ్తైయండీ. ఆడోరు పెట్టిన వస్తువులు.

బాబు—(పుస్తకాలూ అవీ బల్లమీది నుంచి క్రింద పడేసి) ఊఁహు కనపడలేదు. అయితేచూడు చాకలీ ఎక్కడ పెడుతుందే పుస్తకం మీ అమ్మగారూ?

చాకలి—పరుపు కింద సూడండి బాబయ్యా

బాబు—అవునవునేవ్...(పరుపుఎత్తి క్రిందపడేసి) ఎదీ ఇక్కడాలేదు ఇహ నేను వెదకలేను గాని, ఆ బట్టలు అక్కడపెట్టెళ్ళు మీఅమ్మగారొచ్చి, లెఖ్ఖజూచుకొంటుంది.

చాకలి—ఎందుకండీ బాబయ్యా, వంటింట్లో సూచి రండి.

బాబు—అక్కడ కూడా చూసివస్తానుండు, అయినా ఈ ఆడవాళ్ళ దాపరికాలు ప్రాణాలు తీస్తయి.

చాకలి—చూడండి బాబయ్యా...అక్కాడేఉంటుంది.

బాబు—(రెండుడబ్బాలు క్రిందపడేసి పుస్తకం వెదికి తెస్తాడు) ఊఁ...సరే...ఒక్కచొక్కానూ...దుప్పటీ తేవాలె సరే...ఇకపో (స్వ) అబ్బ కాస్త పండుకొంటే, బాగుండు. గలీబులు మాసినై. ఛీ, ఛీ దుప్పటినిండా మన్ను

(దుప్పటి దులిపి) ఛూ, ఇంటావిడ లేకపోతే, దుమ్ము ధూళీ కూడా నామీాది కెగిరి పడుతుంది! మా జయ ఉంటే ఎక్కడి వక్కడే అణగి పడుంటై. (గడియారం పదకొండు గంటలు కొడుతుంది) పదకొండైందే!! కాస్త నడుము వాలుస్తాను. (ఎవరో బయట తలుపుపైన ఠక్ ఠక్ మని ముష్కారు కొడతారు) ఎవరదీ?

రామూ—(సవినయంగా) రావుజీ

బాబు—రామూ నువ్వేనా రావచ్చు.

రామూ—పడక గదిలో ఉన్నావని సందేహించాను. అల వైకుంఠపురంబులో, నగరిలో, ఆమూాల సౌధంబులోపల, మందారవనాంతరామృతసరః ప్రాంతేందు కాంతోపలోత్పల పర్యంక రమావినోది.........................

(రాగంతో పద్యం పూర్తిజేసి)...ఇల్లంతా...ఇల్లాగ ఉందేం?

బాబు—ఏం?

రామూ—అఁహ ఏం లేదు లే. ఏదో...ఇదిగా ఉంది

బాబు—అల్లాగ చూస్తావేం.రా! నీ...కేమైనా పిచ్చి ఎక్కిందా?

రామూ—నాకా? పిచ్చా? అఁహ నాకేం పిచ్చి ఎక్కలేదు ఇంకా. మాతమ్ముడికి ఉండేది పిచ్చి చిన్నప్పుడు అదైనా ఇప్పుడు లేదు పోయింది సరేకాని.........నీవు అల్లాగ ఉన్నావేమిా అంటూ? (నవ్వి)

బాబు—ఎల్లాగ ఉన్నానూ!

రామా—నీవు కూడా ఏదో......ఇదిగావున్నావూ

బాబు—మరేంలేదూ...కొద్దిగా నీరసంగాఉంది.

రామా—నీరసంగాఉందీ?...కొద్దిగా తిక్కతిక్కగా కూడా ఉంటుంది!! ఇహా ఎందుకూ? Night starvation. This is evidently a case of Night starvtion తెలిసిందా ?

బాబు—ఏమిటి నీ ఉద్దేశం ?

రామా—ఏమిలేదురా...రాత్రిళ్ళు...నీకు అన్నం సహించటం లేదన్నమాట!...అదిసరేగాని, అమ్మ, నాన్న ఉన్నట్టు లేరేం ?

బాబు—లేరు గుంటూరు అక్కయ్య గారింటికి వెళ్ళేరు.

రామా—మరి మావదిన గారూ ?

బాబు—ఆవిడా దయచేసింది పుట్టింటికి.

రామా—అదీసంగతి...అల్లాగ చెప్పరాదూ! అందుకనే అల్లాగ ఉన్నావు !!

బాబు—అన్నిసార్లు అంటున్నావు. ఎల్లాగ ఉన్నానేమిటి ?

రామా—ఎల్లాగ ఉన్నావని చెప్పేది ! దుష్యంతి మహారాజులంగారికి శకుంతలపై అనురాగం కలిగిన తరువాత నిద్రపట్టింది కాదట ! తలక్రింద చెయ్యి పెట్టుకొని పడుకోగా కన్నీటి వలన ముంజేతి కంకణాలలో తాప బడినటువంటి మణులు నీరెక్కి మలినంతో కూడుకొన్నవి అయినాయట ! అల్లాగ ఉంది నీస్థితి !!

బాబు—బాగా నేఉంది.

రామూ—నిజంగా, నేను ఇల్లు చూచి నప్పుడే అనుకొన్నాను ఇంటావిడ లేదా ఏమిటి చెప్మాఅని. బాగానే ఉంది! ఎంతపని జరిగిపోయింది!

బాబు—ఏం, జరిగిందని అల్లా ఇదై పోతావూ!

రామూ—ఇంతకంటే, ఏంజరగాలె!! పెద్దవాళ్ళు లేని సమయంలో నిన్ను ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయింది. ఇల్లాం టప్పుడు. భోజనంసరిగా లేకపోవటంలో విపరీతం ఏమీలేదు. (ఈమాటలు దీర్ఘాలుతీస్తూ అంటాడు)

బాబు—నీను ఖం...ఇహ ఊరుకో,

రామూ—ఊరుకొంటానికి కాదు...ఇల్లాంటప్పుడు భోజనమే కాదూ, గుక్కెడు మంచినీళ్ళు కూడా లోపలికి పోవు ఏమను కొన్నావో.............

తెలిసిందా?.........అయితే క్రొత్త పరిస్థితు లేర్పడి ఆమెగారు వెళ్ళిందా?.........అంటే...............

బాబు—అంటే లేదు...గింటే లేదు గానిఇహాఊరుకో అసలు అల్లాంటిదేం గాదు.

రామూ—(ఉద్రేకంతో) అల్లాఅయినట్లయి తేనిష్కారణంగా...అంటే...ఏమీ— కారణం లేకుండా వెళ్ళి ఉండి నట్లయితే...ఇది కేవలంఅన్యాయుం...అత్యంత ఘోరము. భరత దేశం కాబట్టి...ఇట్టిదుర్భర దురంతాలు జరగటానికి వీలైంది.

బాబు—పిచ్చి కేక లెయ్యక...ఎవరైనా వింటే నవ్వుతారు. ఊరుకో.

రాముా—ఊరుకోను...ఇట్టి అన్యాయాలు నాకళ్ళ ఎదుటనే జరుగుతుంటే నేను ఎల్లాగ ఊరుకోను (ఒక్కొక్క మాటే విడివిడిగా నొక్కి అంటాడు) ఆడవాళ్ళు పుట్టిళ్ళకు వెళ్ళకూడదూ అని ఒక కఠిన శాసన నిర్మాణానికై నాజీవితం ధార పోస్తాను.

బాబు—అల్లాగే కానీ. అయితే ప్రస్తుతం కేక లెయ్యక కూర్చో.....సోడా కావాలా?

రాముా—వద్దు (కోపం. ఇంకా తగ్గలేదు)

బాబు—ఇదిగో...కాస్త ధూమపానం చెయ్యి.

రాముా—(శాంతించి) అయితే...నీవు హోటల్లో భోజనం చేస్తున్నా వన్నమాట.

బాబు—ఆ, అంతే...మరేంజేస్తాం.

రాముా—అవుననుకో...ఊ...సరే...అయితే... కోటాయ్ కనపడడేం !!

బాబు—వాడికి కడుపు నొప్పిగా ఉందట నిన్నా ఇవ్వాళా రాలేదు.

రాముా—కడుపు నొప్పా?

బాబు—ఏమిట్రా వెర్రివెధవా...కడుపునొప్పి అంటే అంత విచిత్రంగా చూస్తావేం అదేదో అపాయకరమైన జబ్బు అయినట్టూ ?

రామూ—కాదు, కాదు చెబుతా. విరోచనాలు కూడా ఉన్నాయా?

బాబు—ఆ...ఉన్నాయి.

రామూ—అయితే డోకులు కూడా ఉన్నై అన్న మాటేగా?

బాబు—ఏమో తెలియదు.

రామూ—ఇంకెందుకూ ఉండే ఉంటాయ్ తప్ప కుండా ఉంటాయి పాపం!

బాబు—ఏం, అల్లాఅన్నావు.

రామూ—వూళ్ళో కలరా జోరుగా ఉంది.

బాబు—అఁహ వీడికి కలరా కాదు బాగానేఉన్నాడు.

రామూ—కావచ్చు. సంగతి చెప్పాను. ఆదీ సంగతి అయితే......బాబూ...ఏదీ ప్యాకెట్ (వెలిగించి సిట్టూరొప్ప విడిచి) అయితే......నీవు హోటల్లో భోజనం చేస్తున్నా వన్నమాట.

బాబు—ఎన్నిసార్లు అడుగుతావురా ఆ ప్రశ్న! అవును హోటల్లోనే భోంచేస్తున్నాను.

రామూ—అవుననుకో......అది కాదు నేను వెర్రిగా అడగటం లేదు ఒకటి ఆలోచిస్తున్నాను. తెలిసిందా?

బాబు—నీవు ఏమిచెప్పావని నాకు తెలియటానికి.

రామూ—అది కాదోయ్ వెర్రినాగమ్మ వూళ్ళో... కలరా...జోరుగా ఉన్నప్పుడూ......నీవు... హోటల్లో తిండి తినటం...అట్టేమంచిది కాదు. ఇప్పుడు తెలిసిందా?

బాబు—అదా నీవనటం...అయితే సరే...నీవన్న మాట నిజమే...కాని ఏం చేయమంటావూ ?

రామూ—ఏం జేయమంటానా ? కాస్తపొయ్యిమీద పెట్టుకోమంటా ?

బాబు—నిజమే కానీ...నాకువంటచేయటంబొత్తుగా రాదు. ఇంతవరకు నే నెప్పుడూ...పొయ్యి రాజేసిన పాపాన పోలేదు,

రామూ—ఓరే బాబూ వంట చేయటానికి ఏం తెలియాలరా ? ఏమ్హీ తెలియనక్కరలేదు. చెయ్యటమే... తెలిసిందా అంతగా తెలియకపోతే... ఒక పాకశాస్త్ర పుస్తకం కొను. తెలిసిందా ?

ఎనిమిది అయినట్లుంది...నేను స్టేషను కెళ్ళాలె... సరే...అదీ సంగతి తెలిసిందా ?... ఏదీ ...(ఒక సిగరెట్టు జేబులో వేసుకొని రెండవది వెలిగించి) ఎందుకు చెప్పుతున్నానో విను. గిద్దెడుబియ్యం వండుకో కాని...హొటలుకెళ్ళక... తెలిసిందా ?

గుడ్ బై......

మూడవరంగం

(అదే. ఇల్లు. కానివంటఇల్లు...... బాబు ధోవతి కట్టుకొని,పైనతువాలా వేసుకొని ఉంటాడు ఒకమూల అరిపోయి ఉన్న పొయ్యి—దానిపై గిన్నె. ఇంకో పొయ్యిమీద

కూరగిన్నె. ఇంటిముందు బండి ఆగిన చప్పుడువిని బాబు వీధి తలుపు తీస్తాడు. బండిలోనుంచి జయ, మీనా, దిగుతూ ఉంటారు—జయ ఉప్పాడ జరీచీర కట్టుకుంటుంది. మీనా పరికిణీ కట్టుకొని పైన వల్లె వేసుకొంది)

బాబు—ఇవ్వాళే వచ్చారే! మీనకూడా వచ్చిందే! ఏం మీనా ?

ఆ మూట ఇంట్లో పెట్టవోయ్. ఆజాడీ లేమిటి? సరే తీసుకురా. ఆ బుట్టలేమిటి ?

మీన—పండ్లు బావా.

బాబు—(అన్యమనస్కుడై) పండ్లా? పండ్లెందుకూ ?

మీన—ఇదేమిటేఅక్కయ్యా? పండ్లెందుకూ అంటాడేమిటే? (నవ్వి) పండ్లు తిటారు బావా !

బాబు—అవును అవును లే......నిన్ను చూచిన తరువాత మతికూడా పోయింది నాకు మీనా !

మీన—ఈమధ్య నీకు ఎప్పుడొచ్చిందీపోవటానికీ ?

జయ—మీ సరసాలకేం గానీండి...ఆతన్ని పంపేశెయ్యండి.

బాబు—పొమ్మనూ.

జయ—నాదగ్గర చిల్లగ లేదు.

బాబు—అల్లాగ అనరాదూ...(పర్సు తెచ్చి) ఇందవోయ్......అంతేగా......ఇందు.

జయ—అల్లాగ ఉన్నారేమండీ.

బాబు.....................................

జయ—మిమ్మల్నే...అల్లాగ ఉన్నారేమిటా అంటా ?

బాబు—ఉత్సాహం లేదూ.........ఎల్లాగున్నానూ ?

మీన—హోటల్ భోజనం సరిగా లేదని వ్రాశాడు కాదే ! (నవ్వి) భోజనం సరిగా లేకే, ఇల్లాగ అయిపోయినాడు పాపం.

చెక్కిళ్ళు చెమరించి చిక్కిపోయాయి
బంగారు మైచాయ కందు వారింది
తళుకు కన్నుల సొబగు తగ్గిపోయింది
అక్క ఆబ్ సెన్సులో చిక్కాడు బావ.
చిక్కాడు చిక్కాడు
చిక్కి సగమైనాడు

జయ—ఊరుకోమీనా అల్లరిచేయక నీకవిత్వానికేం గాని, మీనా, ఇల్లంతా నానా గలీజుగా ఉంది చూశావా ?

మీన—ఉండదు టేమరీ! నువ్వులేకపోతే ఎల్లాగ ఉంటుందే అక్కయ్యా ! ఆడది లేని కాపురం — వెన్నెల లేని రాత్రీసీ !...

జయ—ఎక్కడఉండాల్సినవి అక్కడ లేవుగద ! వంటింట్లోకి ఎందుకొచ్చిందిచెప్పూ ఈ టేబిల్ ?...

ఈ త్రాసేమిటి ఇక్కడా ?

మీన—నేనింకా చూడలేదు సుమీ, ఈ త్రాసు ఎందుకు బావా ?

బాబు—త్రాసా త్రాసూ...(తలగోక్కుంటాడు)

మీనా—అక్కయ్యా. నీవు కూర్చుని తులాభారం తూగొచ్చు. అంతేనా ?

బాబు—చెబుతా...ఇప్పుడు చూశావ్ కూరల్లో. పులుసులో. పిండివంటల్లో వెయ్యాలిసిన వస్తువులు. సరిగ్గా తూనిక ప్రకారం వేస్తే... వంట రుచిగా ఉంటుంది ఏమంటావ్.

మీన—అవును బావా......(నవ్వు)

అందుకని త్రాసు ఒకటి కొన్నాను. ఇది చాలా ఖరీదు అయింది కూడానూ!!

మీన—(నవ్వు) చాలా బాగుంది బావాఈఏర్పాటు అక్కయ్యా...... ఆత్రాసేంచూస్తావు ...ఇల్లా ఒక్క మాటురావాలే. చూశావా ఈఏర్పాటు అంతా? అల్లం మినపప్పు...జీలకర్ర...మెంతులు...ఆవాలు...ధనియాలు (నవ్వు) భేష్. భేష్. అంతా ఆసుపత్రిలాగ తయారైంది. ఇంకా తమాషా అంతా చూడలేదు మనం...వంటచేస్తున్నాడే బావ!...

జయ—ఇదేమిటండోయ్...వంటచేయటం ఎప్పుడు నేర్చుకొన్నారూ ?

మీన—చదువు కొన్నవాళ్ళ కేముందే......ఏది బడితే అదే ఊహామీదవచ్చేస్తుంది! వంట ఏమిటి! వడ్లదంపుడుఏమిటి! ఏదయినాసరే...ఇట్టే వచ్చేస్తుంది?

జయ—నీదంతా ఇదీ...ఇంగ్లీషుచదువుల్లో వడ్లదంపుడు ఉందా ?

మీనా—ఎందుకుండదే జయక్కా! అన్నీ ఉంటై ఇంతకూ నీవు అదృష్టవంతురాలవేఅక్కా. బావనీకు పంచ భక్ష్యపరమాన్నాలూ వండి పెడతాడు ఎక్కడైనా వేరేదు కాపరం పెడితే......అక్కా......అక్కా... బావమీాద పద్యంకడుతున్నాను ఉండు...(ఆలోచించి క్షణం అయినతరువాత)...ఆ అక్కయ్యా...

అధిక బలుండైన భీమసేనుండే
వలలుడను పేరున వంటలవాడుఅయి
పలు తెరంగు పప్పుల పిండివంటలున్
ఒప్పుగ జేసె మహీశుని మెప్పుగాంచి
నిచ్చలు షడ్రసంబులు, బావ, నీ
నచ్చిన పాకమునన్ పచనంబొనర్చిగో
ర్వెచ్చని పాయసంబులన్ పెట్టునులే
క్రొంజవుల్ జనింప ప్రీతిపుట్టగన్

బాబు—పద్యంబాగానేఉందే మీనా ఆతమాషే...

మీన—(మాటకు అడ్డొచ్చి)...బావా బావా. అయితే ఆవేలుకి కట్టేమిటి?

బాబు—ఇందాక బెండకాయలు తరుగుతుంటే వేలు తెగింది.

జయ—అయ్యయ్యో...ఏందు కొచ్చిన అవస్థిది మీాకూ?

బాబు—అవస్థ ఏముందిజయా ఏదో సరదాపడ్డాను.

మీన—బావకు ఇటువంటి సరదా కలగటం నీ అదృష్టం కాదుటే అక్కయ్యా? నీవేం కష్టపడక్కరలేదు.

జయ—అయ్యో! అయ్యో! ఆయన వండటం, నేను తినటం !!

మీన—వండలేకేమే అక్కయ్యా ఇదిగో చూడు అన్నం !

జయ—ఇదేమి అన్నమే ?...బియ్యం బియ్యంగానే ఉన్నాయి !

బాబు—బియ్యం...ఇంకా...అన్నంగా మారలేదు

మీన—పాపం పొయ్యి...ఆరిపోయిందే ! దానికేం గాని కూర వండాడుచూశావా ? బెండకాయకూర దివ్యంగా తయారైంది !!

బాబు—ఇంకా తిరగమూతా, అదీ వెయ్యలేదు. వేద్దామని అనుకుంటూ వుండంగానే మీరూ వచ్చారు.

మీన—వెయ్యాలా ఏమిటే ? వెయ్యకపోతే నేమి? దివ్యంగా ఉందికూర !

జయ—ఏదీ !...ఇవేమిటే బొగ్గులాగ !!

మీన—బొగ్గులా ఇవి !! బెండకాయ ముక్కలు కనపడటంలేదటే ! నలభీమ పాకాలు తయారుచేశాడు. బావ ! ....అయితే...... ...బావా...అసలు నీకు వంట చేయటం ఎల్లాగ చేతనైందీ అంటా !!

బాబు—పాకశాస్త్ర పుస్తకం ఒకటి కొన్నాను.

మీనా—అదీ సంగతి!! పుస్తకంజూచి వంటచేయటం మూలానే...ఇంత బాగా తయారైంది !!

ఈ తెల్లకాయితాల పుస్తకం పెన్సలు ఇక్కడున్న వేం బావా? ఇందులో ఏవో లెక్కలు వ్రాసుకొన్నాడే! (చూచి విరగబడి నవ్వి.) అక్కా...అక్కా—రావాలె ఈ లెక్క చూశావా...“పిసెడు బెండకాయలకు నాలుగు తులాల ఆవాలైతే...అర్ధశేరు నవటాక్కు ఎంత ! (మళ్ళీ విపరీతంగా నవ్వి) లెక్కలుచేస్తున్నాడే వంటకూ !! (నవ్వు తెర) అమ్మ ఇక నవ్వలేనే కాసిని మంచినీళ్ళు ఇయ్యవే జయక్కా.

జయ— బిందెలో ఉన్నట్లున్నయి — (చెంబుతో ముంచి ఇస్తుంది)

మీన—ఉప్పు నీళ్ళేమే !

జయ—అయ్యో......

బాబు—ఇల్లాంటి పొరపాట్లు వస్తాయనే అక్కడ వ్రాసిపెట్టాను. ఇవి మంచినీళ్ళూ, ఇవి ఉప్పు నీళ్ళూ అని !

మీన—నిజమేనే అక్కా, ఇక్కడ బిందెలకు కట్టిన అట్ట ముక్కలు చూడలేదు నీవూ !! పాపం. వాటిపైన, మంచినీళ్ళు ఉప్పు నీళ్ళు...అని వ్రాసి పెట్టాడే !! (నవ్వు)

జయ—ఇంటినిండా అట్ట ముక్కలే !!

మీన—తీసి పారేయవే జయక్కా లేకపోతే... మన మెడలకు కూడా కట్టేటున్నాడు...జయ...మీన... అని...

జయమ్మ కాపురం

ద్వితీయాంకము—ప్రథమరంగం

[పటాలతో అలంకరించినగది ఒక బల్లమీద ఊదు వత్తులూ, ఫలహారాలూ, ఇంకో బల్లమీద రేడియో ఉంటాయి గదిలో గోడను ఆనుకొని ఒక చక్కని మంచం. దానిపైన పరుపు తెల్లని దుప్పటీ ఆ పైన పూలు.

బాబు టేబిల్ ప్రక్కగా ఉన్నకుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తూ మధ్య మధ్య మేడమెట్లవైపు తొంగి చూస్తూ ఉంటాడు. మెట్లదాక వెళ్ళి మళ్ళీ తిరిగి వస్తుంటాడు.

గోడగడియారం 9 గంటలు కొడుతుంది. గడియారం అంకెలు చూస్తూకూడా తొమ్మిదిగంటలూ లెక్కపెడతాడు.

ఇంకోసారి మెట్లదాకా వెళ్ళొచ్చి ఆవలించి చిటికలు వేస్తాడు. జయ క్రిందహాలులో, ఆడబిడ్డతోను, ఇంకెవ్వరో ఒక రిద్దరు స్నేహితులతోనూ మాట్లాడుతూ ఉంటుంది. బాబు కాసేపు ఆడాబాపైన పచారుచేస్తాడు నవవధువు ఎంతసేపటికీ రాదు.]

బాబు—అమ్మా కాసిని మంచినీళ్ళు కావాలే.

అత్తగారు—(జయ అత్తగారూ ఆడబిడ్డా ఒకరి మొఖం ఒకరు చూచుకొని నవ్వుకుంటారు. జయ అత్తగారు అంటుంది.)

'వెళ్ళవేజయా, వెళ్ళి కాసినిమంచి నీళ్ళు ఇచ్చిరా వాడికి.'

జయ—మంచం క్రిందే పెట్టానండీ-కనపడలా ?

బాబు—(ఒక్కక్షణముండి) ఆఁ ఆఁ సరేలే.

మీన—బావ ఏం జేస్తున్నాడో చూచొస్తా.

జయ—నీ వక్కడికి వెళ్ళబోకు మీనా. బావను చదువుకోనీ......క్రిందటి సంవత్సరంకూడా పరీక్షపోయింది:

మీన—పాపం పగలల్లా ఏం కష్టపడి చదువుతున్నాడే. (నవ్వుతుంది) చూస్తునే ఉన్నావు నీవు కూడా బావ గదిలో చేరి చదువు పాపం సాయంజేస్తున్నావు కాబోలు!!

జయ—మీనా, నీవూరుకో. ఈ ఎండకాలం పగులు అసలు చదువుసాగదు. ఏమన్నా చదివితే రాత్రిళ్ళే !!

బాబు (కాసేపు చదువుకొని, క్రిందికి వస్తాడు)

బాబు—నిప్పుపెట్టె చూశావుటే మీనా !

మీన—అక్కయ్య పెట్టెలో ఉన్నయ్యి నిప్పు పెట్టెలు. తాళంచెవి దాని మెళ్ళోఉంది.

అత్తగారు—ఓసి, ఛడవా......ఎంత టక్కరుగా మాట్లాడతావే, జయా. చూచి ఇవ్వవేపాపం వాడు చదువుకోవాలె.

జయ—పెట్టెలోవి తీయటం ఎందుకూ లాంతరుపైన ఉంది అదిగో!! కనపడలేదండీ!

బాబు—కనపడ్డది. కనపడ్డది. (అనిముడుచుకొని వెళ్ళిపోతాడు.)

మీన—బావకు ఏమీ 'కనపడవేమే! (ఆవలిస్తుంది)

జయ—సరే కాని పడుకో పో నీకు నిద్రవస్తూంది.

(గడియారం పదిగంటలు కొడుతుంది జయఆవస్తుంది)

అత్తగారు—పో అమ్మా వెళ్ళిపడుకో—పద్దైంది.

మీనా—వెళ్ళవే, పాపం బావకు నిప్పు పెట్టేలూ మంచినీళ్ళా అవీ కనపడటంలేదు !! నానా అవస్థాపడు తున్నాడు. వెళ్ళి...ఏవి......ఎక్కడ...ఉన్నవీచూపించు. (అంతా నవ్వుతారు)

రెండో రంగం

VI

(ఇందాకటి పడకటిల్లే దీపం వెలుగుతునే ఉంటుంది. బాబు పక్కపై పడుకొని కళ్లుమూసుకొని ఆలోచిస్తుంటాడు మెట్ల దగ్గర గాజులచప్పుడు కాగానె, జయ వస్తున్నదని గ్రహించి నిద్రనటిస్తుంటాడు)

జయ—(ప్రవేశించి) (స్వ) దీపం, ఆర్పేయకుండానే పడుకొన్నారే చదువుతూ చదువుతూ నిద్రపోయినట్లుంది. పుస్తకం ప్రక్కనే పడేసుంది ! (అని పుస్తకంతీసి బల్లమీద పెట్టుతుంది:) పాపం, పరీక్షలో కష్టపడి చదువుతున్నారు (అని తనలోతాను నవ్వుకొంటుంది) ।(ఈమాట వినేసరికి బాబూకు నవ్వొస్తుంది తానెంతకష్టపడి చదువుతున్నదీ, ఆతనికి తెలుసునాయె అందుకని నవ్వుకుంటాడు. జయ దీపం ఆర్పేస్తుంది)

బాబు—దీపం వెయ్యి.

జయ—(ఫక్కున నవ్వి)అయితే మేలుకొనేఉన్నారా?

బాబు—చదివి చదివి ఇప్పుడే కళ్ళుమూశాను. నువ్వెప్పుడొచ్చావూ?

జయ—మీరు దొంగ నిద్రపోవటం ప్రారంభించటం తోనే వచ్చాను.

బాబు—అదిసరే. దీపం వెయ్యమనలేదూ.

జయ—ఎందుకండీ, నిద్రపోరూ? పాపం కష్టపడి చదివారాయె! (వెక్కిరింతగా)

బాబు—కాదు. కాదు నీతో కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలె. (జయ దీపంవేస్తుంది. ఇద్దరూ చెరో కుర్చీమీద కూర్చుంటారు. బాబూ జయవంక చూస్తాడు)

జయ—ఎందుకలా దీపం వెయ్యమన్నారూ? చెప్పండి తొందరగా. నాకు నిద్రవస్తున్నది. వెళ్ళి పడుకోవాలె

బాబు—పడుకుందుగాని ఉండు.

జయ—ఎందుకండీ?

బాబు—అదిగాదు ఈ ఎలక్ట్రిక్ లైట్లో నిన్ను కాసేపు చూడనియ్యి.

జయ—పగలంతాచూస్తునే ఉంటిరి గదండీ. చదువు కూడా మానేసి

బాబు— అదివేరు. రాత్రి లైట్లో అదో విధంగా ఉంటావు...నీఇల్లు బంగారంగానూ అల్లా నవ్వుతావేం?

జయ—(ఒక్కక్షణం అయిన తరువాత) చూశావా ! నేను పడుకుంటా—మీకేం ఆవలోకి తేశ్వరుడులాగ చూస్తునే ఉంటారు (అంటూ దీపం ఆర్పేస్తుంది తనగదిలోకి వెళ్ళబోతుంది)

బాబు—(లైటు వేసి) జయా జయా, ఒక్కమాటమరి అల్లాగ మూర్ఖంగా వెడితే గాదు.

జయ—ఏమిటి చెప్పండి.

బాబు—కూర్చో చెప్తా.

జయ—ఆ చెప్పండి.

బాబు—మరీ...ఇప్పుడు పొద్దుపోయిన మాటనిజమే నీకు నిద్రవస్తూండవచ్చు, ఆమాట నేను కాదనను కాని...

జయ—ఏమిటండీ...ఇదంతా

బాబు—వినాలె అల్లా తొందరపడితే కాదు

జయ—వింటాను, చెప్పండి.

బాబు—నేను చెప్పేది చాలా ముఖ్యమైన విషయం అంటే మామూలు విషయం కాదు. (అంటూ కుర్చీ జయమ్మ కుర్చీవైపునకు జరుపుతాడు) అయిందా ?

జయ—ఏమిటి అయింది !

బాబు—విషయం మామూలు విషయం కాదు.

జయ—(జయ కుర్చీకొంచెం బాబు వైపులాక్కొని శ్రద్ధగా వింటానికి తయారవుతుంది)—ఊఁ

బాబు—అంటే చాలా ముఖ్యమైన విషయమన్న మాట; ఇప్పుడుచూశావా (కుర్చీకొంచెం ముందుకు జరుపు

కొని)ఒక్కొక్కవిషయం ఎల్లా అయినా ఫరవాలేదు. కొన్ని కొన్ని విషయాలుంటవి...అవీ...ఇంకోలాగ అనుకొంటానికి వీల్లేదు. అవునంటావా?

జయ—అవును.

బాబు—అవునా మరి సీతో...ఇప్పుడుఒక్క ముఖ్యమైనవిషయాన్ని గురించి మాట్లాడాలి. చాలాగొప్పవిషయమన్న మాట.

జయ—ఊఁహూ. చెప్పండి

బాబు—తొందరపడితే ఎల్లాగ. ఇదే మన్నా మామూలు విషయమా చప్పున చెప్పేయటానికి? ఏమిటంటే (గొంతు సవరించుకొని కుర్చీ ఇంకా ముందుకు లాక్కొని) మనయిద్దరికీ సంబంధించిన దన్నమాట.

జయ—అల్లాగే...ఊఁ

బాబు—మీాన నిద్రపోయిందా - ఇక్కడెక్కడన్నా ఉందా?

జయ—లేదులెండి...చెప్పండి.

బాబు—అంటే ఎవరూ వినకూడదూ. చాలముఖ్యమైనవిషయమని చెప్పానుకానూ. మరోటి మరోటి అయితే ఎలాగయినా ఫరవాలేదు. ఇప్పుడు ఈవిషయంలో అటూ ఇటూ అయిందా అంటే; పీకలు తెగిపోతయ్యి.

జయ—ఏమిటంటే అంత గొప్పవిషయం.(ఆమర్ధాగా మరికొంచెం ముందుకొస్తుంది.)

బాబు—గొప్ప అని మెల్లగా అంటూ వేమిటి? కొంప లుఎగిరి పోతయ్యిఅన్న మాట యుద్ధాలు—ఘోరయుద్ధాలు జరుగుతాయి-జరిగినాయికూడా చాలా గొప్ప విషయంలే!- (మాటలు నొక్కి అంటాడు)

జయ—(నవ్వు ఆపుకొని) నిజమే. నిజమే.

బాబు—తెలిసిందా...చాలా గొప్ప విషయమన్న మాట ఊ...పీకలు తెగి పోయే విషయం అన్నమాట

జయ—ఆహా-(ఆశ్చర్యపోతుంది)

బాబు—మగోవిషయం అయితే నేను అసలుపట్టించు కోను.

జయ—అవును. నేను చూస్తునే ఉన్నా.

బాబు—ఇల్లాంటి విషయం. అంటే కొంపలు ఎగిరి పోయే విషయం చూశావూ మనం జాగ్రత్తగా ఉండాలె. ముఖ్యమైన విషయం. తెలిసిందా ?

జయ—తెలిసింది——తెలిసింది. (నవ్వుతుంది.)

బాబు—అసలు విషయం చెప్పనీ......(కొద్దిగా నవ్వుతాడు)

జయ—తెలిసిందిగా...—(పెద్దగా నవ్వుతుంది)

బాబు—చాలా గొప్పవిషయం.ముఖ్యమైనవిషయం. అని బాబు నవ్వుఆపుకోలేక నవ్వుతాడు జయా నవ్వుతుంది. ఒకర్నిజూచిఒకరు నవ్వుతారు. జయ నవ్వు ఆపుకొంటుంది బాబు నవ్వు ఆపుకొంటాడు. మళ్ళీనవ్వు బద్దలై వస్తుంది.

తెరలు తెరలుగావచ్చేనవ్వును ఆపుకొంటూ, నవ్వుకొంటూరు ఒకర్ని చూచి ఒకరు నవ్వుతారు ఇల్లాగ పది నిమిషాలు గడుస్తుంది. చివరకు ఇంతకూ ఆముఖ్యమైనవిషయం ఏమిటంటే-చాలా గొప్పవిషయం. అని విరగబడినవ్వుతాడు బాబు; ఆమే నవ్వుతుంది.

తెర

మూడో రంగం

VII

(పంతులు. 58 ఏండ్ల వయస్సుకాని చూపులకుఇంకా ఎక్కువ వయస్సు కల వాడిలాగా ఉంటాడు బాబూ ఆయనకు ఒక్కడే కుమార్డు. బాబూ మీాద తండ్రికి అమిత ప్రేమ. పంతులూ, మణమ్మగారూకూడా కొడుకునూ కోడల్నిగారాబంగా చూచుకొంటూరు.)

పంతులు—మీానా, మీాఅక్కయ్యనుఓ సారిఇల్లాపిలు

ప్ర. జయ. మీాన.

పంతులు—జయమ్మా, నీవు స్కూలుపైనల్ క్లాసుదాకా చదివావు కాదూ?

జయ—లేదండీ.

మీాన—అయినా పరీక్షకు పంపితే తప్పకుండా ప్యాసు అవుతుందండి మామయ్యా!

పంతులు—అయితే జయమ్మ తల్లీ, నాకు విద్యావంతులైన స్త్రీలనుచూస్తే ఎక్కువగౌరవం. నాపిల్లలూ... ...నాకోడలూ విద్యావంతులై ఉండాలని నేను పెద్దకోరిక పెట్టుకొన్నాను. స్త్రీలకు విద్య చెప్పించండి అని పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇస్తుంటాను కాని నాయింట్లోనే నా కోడలు, పరీక్ష లేవీ ప్యాసు కాకుండా, ఉండి, విద్యావంతురాలు కాదు అనిపించు కోటం నాకు ఏమి బాగుండ లేదు. పరీక్ష ప్యాసు కాకపోతే ఏం అని నీవుఅంటేఅనవచ్చు. అది వేరే విషయం. కాని నీవుస్కూలుఫైనల్ ప్యాసు అయి పైవేటుగా అయి నాసరే బియ్యేప్యాసు కావాలని నాకోరిక. మరిఏమంటావు?

జయ—మరి ఎల్లాగండి. నేను స్కూలుఫైనల్ పరీక్షకు ఒకసారైనా వెళ్ళలేదు.

పంతులు—నిన్ను మెట్రిక్యులేషన్ పరీక్షకు పంపుతాను. ఇవిగో పుస్తకాలన్నీ కొని తెచ్చాను. నీవు తెలివిగల దానివని నాకు తెలుసు. కష్టపడి చదువు,

మీనా—కష్టపడి చదివితే...తప్పక ప్యాసు అవుతుంది. ఫస్టుక్లాసులో ప్యాసు అవుతుంది మామయ్యా! వస్తే మెడల్ కూడా రావచ్చు.

పంతులు—అంతకంటే సంతోషం ఏముందమ్మా జయమ్మా... ఈరోజునుంచీ నీవు చదువు. ఏదైనా తెలియకపోతే నన్ను అడుగు. ఆ...

మీనా—మీరు ఎప్పుడూ ఇంట్లో ఉండరుగా! అందు కని బావ నడుగుతుంది లెండి? ఏంజయక్కా. బావదగ్గర చెప్పించుకో ఏం?

పంతులు—పోనీ అల్లాగే కానీదానికేం. కానీ ఇం కోటి. వాడూ క్రిందటిసంవత్సరం బి. ఎ. తప్పాడు. పోనీలే, తప్పితే తప్పాడు అందుకు కాదు. ఈసంవత్సరమైనా ప్యాసు కావాలె. చదువుతున్నాడనుకొంటా. కాస్తవాడ్ని కనిపెట్టి చూస్తూండు బాగా చదువుకోమని చెప్పు.

మీనా—(నవ్వుతుంది)

పంతులు—ఏమే మీనా ఎందుకు నవ్వుతావూ?

మీనా—ఏంలేదు మామయ్యా బావ బియ్యేను అక్కయ్య మెట్రిక్యులేషన్ నూ ఒకేసారి ప్యాసుఅయితే... (నవ్వుతుంది) చాలాతమాషాగా ఉంటుంది మామయ్యా ఇందులో మెడల్ ఎవ్వరికొస్తుందా అనినవ్వుతున్నాను.

పంతులు—ఎవరికైనా రావచ్చు.

మీనా—ఎవరికొచ్చినా మనకు సంతోషమేగా మామ య్యానాఉద్దేశంలో అక్కయ్యే మెడలు సంపాదిస్తుంది.

పంతులు—సరే. అమ్మాయి, నాకోరిక...ఊరికే పోనియ్యకు. నీవుతప్పకుండా మెడలుకోసమే ప్రయత్నం చెయ్యి.

మీనా—అక్కయ్యా. నీకు మెడల్ వచ్చిందాకా నేని క్కడేఉంటా. మెడల్ చూచిగాని వెళ్ళను.

నాలుగో రంగం

(రాత్రి 9 గంటలు. మామూలు పడకటిల్లు జయ—బాబు. ఉంటారు)

జయ—అల్లాగ అన్నారు మామగారు ఇక మీ ఇష్టం.

బాబు—మంచిమాటేగా తప్పకుండా నేనుకష్టపడి చదువుతా నీవంటి యోగ్యురాలైన భార్య చెపుతూవుంటే ఎవరువినరు?

జయ—మీరు తప్పకుండా ప్యాసుఅవుతారు.

బాబు—నీవుకూడా కష్టపడిచదువు నాన్న కోరిక చెల్లించాలె.

జయ—అదేచూస్తున్నా. ఎట్లాగయినా మెడల్ సంపాదించి మామగారిని సంతోషపెట్టాలని.

బాబు—నేను. నిజంగా ప్యాసు అవుతాను జయా మనం ఇద్దరం కూడా ఒకేసారి ఫ్యాసుకావాలె

జయ—నాకోరికా అదే. నేను మెడల్ సంపాయిస్తే కనకదుర్గమ్మకు వండకొబ్బరి కాయలు కొడతాను. పానకాలరాయడికి వందబిందెల పానకంకూడా చేయిస్తాను.

బాబు—అంతే. అంతే.

జయ—నే ఫ్యాసుఅయి మెడల్ సంపాదిస్తానా. ఇంక నాకు ఏకోరికా ఉండదండీ.

బాబు—ఇద్దరం ఒకేసారే తప్పక ఫ్యాసుఅవుతాము. రేపటినుండే చదువుకు ప్రారంభం నీవుహాల్లోకూర్చో, నేను గదిలో కూర్చుంటాను, తెలిసిందా.

జయ—సరే, అల్లాగే.

జయమ్మకాపురం

తృతీయాంకము—మొదటిరంగము

(పగలు ఎనిమిదిగంటలు కాఫీత్రాగి బాబూ చదువు కొంటూ ఉంటాడు పుస్తకాలన్నీ చక్కగాసర్ది పెట్టుకొని దీక్షగాచదవాలన్న ఉద్దేశాన్ని, నిశ్చయాన్నీ పుస్తకాలు సర్దటంలో స్పష్టంగాకనపరుస్తాడు. పుస్తకాన్నిచూస్తూ కుర్చీలోకూర్చుంటాడు.)

మీన (పాడుతూ ప్రవేశము)

బావా!

బాబు—ఎందుకే మీనా?

మీన—ఎబ్బే ఏంలేదు. బావా కుర్చీలోనుంచిపడ తావేమో, పోనీ ఆమంచంమీదకానేపు పడుకోరాదూ బొత్తిగా తూలిపోతున్నావు.

(వళ్ళువిరుచుకొని ఆవలించి) అల్లాగా రాత్రంతా నిద్రపట్టలేదుమీనా.

మీన—అవునవును అక్కయ్యాఅల్లాగే ఉంది. పాపం మెడల్ కోసం ప్రయత్నిస్తున్నారామె—(నవ్వుగా)

బాబు—(కొద్దిగా నవ్వి) అంతే-అంతే-అక్కయ్య ఏంజేస్తున్నదీ? (నిద్రమత్తుగా చూస్తూ)

మీనా—హిస్టరీ పుస్తకాన్ని ముద్దెట్టుకుంటున్నది. (వెక్కిరింతగా)

బాబు—పరీక్ష ఇంకా ఎన్నాళ్ళో లేదు. ఇల్లాగ అయితే లాభంలేదు. (మత్తులోఉండి మాట్లాడినట్లు) ఒక సారి ఇల్లా పంపించు, మీఅక్కయ్యను గట్టిగా కోప్పడాలె.

మీన—వద్దు బావా. నీవే కోప్పడితే...ఎల్లా ఈ సారికి క్షమించు...

బాబు—సరే...క్షమించానని చెప్పు — గట్టిగా చదువుకోమను (అని తాను వెళ్ళి పరుపుపైన పడుకొంటాడు)

మీన—అల్లాగే—(అని వెక్కిరింతగా అని వెళ్ళుతుంది)జయక్కా - ఈ తఫాకు నిన్ను క్షమించాడు బావ.

జయ—ఎందుకే.

మీన—చదవటం లేదుగా.

జయ—అఁహా...అందుకా—(నిద్రమత్తు)

మీన—మరినీవు ఈ సంవత్సరం మెడల్ సంపాదించకపోతే ఊరుకోట్ట !!

జయ—(బాగా నిద్రమత్తుగా ఉండి కుర్చీలో నుండి లేచి పరుపుపైన పడుకొని) అందుకనే............

బాబు—(ఒక్క క్షణం అయిన తరువాత బాబూ ఉలిక్కిపడి పుస్తకం తెరచి ఒకనిమిషం చదివి)—జయా

జయ—(ఉలిక్కిపడి లేచి) ఆ —ఎందుకూ (మీనా జయగదిలో ఉంది. అక్క ఉలిక్కిపడి లేవటం చూచి నవ్వుతుంది)

బాబు—జయా ఒక్కసారి ఇల్లా వస్తావూ

జయ—ఎందుకూ ?

బాబు—ఒఖ్ఖసారి రావాలె.

జయ—ఊహు.

బాబు—కాదు. పనుంది.

జయ—వీల్లేదండీ చదువుకొంటున్నా — (నవ్వుకొంటుంది).

బాబు—ఇప్పుడే వెళ్ళవచ్చు.

జయ—ఎందుకూ ?

బాబు—ఎందుకా ... ఎందుకంటే...... మరి... చూశావు ఎందుకు చెప్మా ? వెధవమతి మరపు. చదువుకోవాలె. అందుకని ఒక్కసారి ఇల్లా రమ్మంటున్నా.

జయ—(పెద్దగా నవ్వి) చదువుకొనే దానికి నే నెందుకూ. రాను. చదువుకోవాలె. పుస్తకం తెరిచి చూస్తుంటుంది)

బాబు—అదిగాదు జయా......చదువు సాగకుండా ఇక్కడో కాకి గోలచేస్తున్నది. కాస్తనచ్చి తోలేసెయ్యి.

(వెళ్ళటానికి — లేస్తుంది. మీనా అక్కను కుర్చీలో కూర్చోబెట్టి, ఆగదిలోనుంచే హూష్ — హూష్ — అంటుంది. అని జయ మీనలు నవ్వుతారు. జయా, మీనా,

బాబు గదిలోకి నవ్వుకుంటూ వెడతాడు. బాబూ కూర్చుని ఉంటాడు చేతిలో పుస్తకం ఉంటుంది)

మీన—బావా, పోయిందా కాకీ ? పాపం చదువుకో నీకుండా గోలచేసిందా ! కాకిగోల !— కాకిగోల ! ఏంచదువు సాగుతోంది పాపం! (అంటూ తలనిమురుతోంది)

బాబు—కాకిపోయేఉంటుంది. కాని రెండు చిలకలు కిచకిచ లాడుతున్నాయి. చూశావా !

మీన—నీవు సరిగ్గా చూడలేదు ఒకగోరింక కూడా ఉంది.

(అని తుర్రున పారిపోతుంది)

(జయా, బాబూలు ఒకర్ని జూచి ఒకరు నవ్వుకొంటారు),

X

రెండో రంగం

(మామూలు పడకగదికి ముందున్న హాలు, జయ, బాబు ఎదురు బొదురుగా కూర్చుని మాట్లాడుతూ ఉంటారు. ఊదువత్తులు వెలుగుతూ ఉన్నై. ఆవైపున తెల్లని పక్షి దంపతులను ఆహ్వానిస్తూ ఉంటుంది. మీన పాడుకుంటూ వచ్చి దూరంగా ఏదో సద్దుతూ ఉంటుంది. రాత్రిసమయము)

జయ—మీరు బొత్తిగా చదవటం లేదు.

బాబు—మాట్లాడకు.

మీన—పాపం చదువుతునే ఉన్నాడే! రాత్రంతా చదవటం మూలాన చూచావుగా ప్రొద్దున్న పాపం చదవ లేక పోయినాడు. అంతేకాక రాత్రిళ్ళు బాగా చదువు తున్నాడు.

జయ—అవునవును. (అనినవ్వుతుంది మూతివిరుస్తూ)

మీన—అవునుగాని బావా ఇవ్వాళ రాత్రిచాలా సేపు చదవాలె నీవు. నీకోసం టీ కూడా చేశాను. పుచ్చుకొని మేలుకొని కష్టపడి చదువు, తెలిసిందా? (అని వెళ్ళి టీ తెచ్చి మూడు కప్పుల్లోనూ పోస్తుంది. మీన ముందుగా ఒక గుక్కెడు త్రాగి) బావాపంచదార కొంచెం తక్కువ అనుకొంటా?

జయ—కొంచెం తక్కువగానే ఉంది.

మీన—ఇంకొంచెం వెయ్యనా బావా?

బాబు—(నవ్వుతూ)- అక్కర్లేదు మీనా—When you are beside me, I want no sugar in my tea- (అని బుగ్గ గిల్లుతాడు)

మీన—చూడవే అక్కయ్యా?

జయ—ఏం జేశారే?

మీన—బుగ్గగిల్లుతున్నాడే!

జయ—బుగ్గ గిల్లుతారుటండీ... (గిల్లు అనేమాట నొక్కి పలుకుతుంది)

బాబు—Excuse me; మీన బుగ్గలు గిల్లకూడదు. అవి, అంటే ఇంత చక్కని గులాబి పువ్వులవంటిబుగ్గలు గిల్ల బడేందుకు ఏర్పడ్డవి కావు, అవి ఎందుకు ఏర్పడ్డయ్యో అంటే

—(ముద్దెట్టుకొని)—అందుకూ.

మీన—ఓహో, (అని మూతి, ముక్కు తిప్పి కోపం నటిస్తుంది)

జయ—ఏం పని, అంటే అది.

బాబు—ఏం ? ఏం ?

జయ—మా చెల్లెల్ని ముద్దెట్టుకోవచ్చా !

బాబు—మనసులో మనసులేదు జయా, ఏమిటో మీ చెల్లె లనుకో లేదు !!

మీన—ఇదెప్పటినుంచే అక్కా !

జయ—మతి లేదే మీ బావకు. చదువు ఎక్కువైంది.

బాబు—ఇక నేను చదువుకోవాలె —(అనిబల్లదగ్గర కెడతాడు—(సీరియస్ గా) (మీన ఆవలిస్తుంది)

జయ—మీనా! నీవు పడుకోతల్లీ

(మీన వెడుతుంది)

వెడుతూ—మామయ్య అడిగితే - బావ చదువుకొంటున్నాడని చెపుతుంది.

(బాబు ఒక్క క్షణం గట్టిగా చదివి)—అయితే జయా ?

జయ—(హాలులో మంచంపై పడుకొని) ఆ—మీరు చదువుకోండి. మామగారు మిమ్మల్ని నాకు ఒప్పచెప్పారు. మిమ్మును చదివించేబాధ్యత నాది. మీరు చదవక జయా, జయా అని పిలిస్తే నేనుపలకను. కష్టపడి చదవండి నామాట విని, మీకే మీరు బాగానే ఉంటారు అంతా నన్నంటారు.

పెళ్ళాంవస్తే చదువువేమి సాగుతుందీఅని. నేనుమాటలుపడను బాబూ! మీరు నన్ను పిలవకండి, ఇదే చెపటం బాగాచదువు కోండి. (అనిసీరియస్ గా చెప్పి వెళ్ళిహాల్లో మంచంపైన పడు కుంటుంది బాబు ఈమాటలన్నీ మెదలకుండా వింటాడు. స్కూలు కుర్రాడులాగ)

బాబు—నిజం. నువ్వన్నమాట ముమ్మాటికీనిజం ఇదిగో ఇప్పుడే ప్రారంభిస్తాను. చదువుతాను. కష్టపడి చదువుతాను నిన్నుపిలవను ఒకవేళ పిల్చినానీవు పలకకు. సరేనా! (అని తన గదిలోకిపోయి చదువు ప్రారంభిస్తాడు. ఆగదిలోనుంచి హాల్లోకి ఘొయ్యే ద్వారం తెరిచేఉంటుంది. జయ పడుకొని గమనిస్తూఉంటుంది.

మూడో రంగం

ఇందాకటిపడకగది. తెరఎత్తేసరికి బాబూమంచం మీద పడుకొని చదువుకొంటూఉంటాడు.

బాబు—(లేచి) ఏంచదవాలో తెలియటంలేదు. అన్నీ వచ్చినట్లే ఉన్నాయి. మళ్ళీ ఏంరాదు.

అని జయనంకచూస్తాడు. తలదువ్వుకొని హాజిలైన్ స్నోరాసుకొంటాడు. మీసాలుదువ్వుకొని సిగరెట్టు వెలిగించు కొని అద్దంలోచూసు కొంటాడు. అది జనవరి 15 వ తారీఖు. ఏప్రియల్ 8 తేదీ ఏవారంఅయిందో క్యాలెండరులోచూస్తాడు "8వ తారీఖునుంచిరోజేమోకనుక్కోవాలె" అనుకొని జయ

మంచందగ్గర కెళ్ళి ఒక్క నిమిషం నుంచుని ఆలోచిస్తాడు. మళ్ళీ అద్దంముందు కొచ్చి, చూసుకొంటాడు. మళ్ళీజయదగ్గర కెళ్ళి లేపటానికిసిద్ధం అవుతాడు, సంగుతాడు ముద్దుపెట్టకోపోతాడు.

చప్పున నిరాదున నిలబడి విశ్వామిత్రుడు మేనకను నిరాకరించేపోజులో చెయ్యిపెట్టిఒక్క నిమిషంఉండితిరిగి అద్దం దగ్గరకు పోతాడు. జయ ఈఅవస్థఅంతా చూస్తూ నేఉంది చివరకు లేచి వస్తుంది)

జయ—మీపనులన్నీ చూస్తునే ఉన్నా. రావటం—ఒంగటం—వెళ్ళటం మళ్ళీరావటం అన్నీచూస్తునే ఉన్నా—ఏం బాగుండలేదు, చదువుబొత్తిగా మానేశారు.

బాబు—కుర్చీలోకూర్చుని తలొంచుకొనిమాట్లాడడు.

జయ—మీకే చెపటం వినపడుతున్నదా?

(బాబు మాట్లాడడు. జయ, బాబుగడ్డాన్ని మునివేళ్ళతో నెడుతుంది.) మిమ్మల్నే మిమ్మల్నేనండీ—చదువు బొత్తిగా మానేశారంటున్నా.

బాబూ—అంటున్నావు వింటునేఉన్నా ఏంజెయ్యమంటావూ!

జయ—ఏం జెయ్యమంటున్నానా? ఇంకా తెలియలా కష్టపడి... బాగా.. చదువుకోమంటా. లేకపోతే తప్పుతారు.

బాబు—(తనతొడమీదలాగి కొట్టుకొని)—చదవగా ఇవ్వాళనుంచి అయినా చదువు. లేకపోతే ష్యూరుగాతప్పుతావు. (అని తనకుతాను చెప్పుకొంటాడు.)

జయ—మీ కేమన్నా వెఱ్ఱిఎత్తలేదుగద

బాబు—(నవ్వుతూ) వెఱ్ఱిఎత్తలేదుగాని...

జయ—కానీ......

బాబు—కాని... వెఱ్ఱిఎత్తటంకాదూ. ఏదోపిచ్చి పిచ్చి గాఉంది—

జయ—దాని పేరే. అది—(విరగబడినవ్వుతుంది) మీరు ఇల్లాగపిచ్చి చేష్టలు చేస్తే నేనూరుకోను. నేను చూస్తునే ఉన్నామీరు రావటం—వంగటం వెళ్ళటం-మళ్ళీ రావటం ఇదేనా-ఏమిటీచదువు!! నాకెందుకూ నేను మామ గారితో చెప్తాను. (బాబు దీక్షగా చదువుతున్న వాడి లాగ కుర్చీలో కూర్చుని పుస్తకం తెరచి ముఖం ముందు పెట్టుకుంటాడు...జయ క్రిందకి వెళ్ళిపోతుంది మేడమెట్టు తలుపు తెరచి ఉండటంచూచి పంతులు మెల్లగా మేడమెట్లు ఎక్కివస్తాడు దూరంగా నుంచుని చూచి కొడుకు చదువు కొంటున్నందులకు సంతోషించి క్రిందికిదిగేసరికి జయ ఒక చేత్తో మంచినీళ్ళ చెంబూ, మరొక చేత్తో ఫలహారపు పళ్ళెమూ పట్టుకొని వస్తూ ఎదురవుతుంది)

పంతులు—అయి తేజమ్మా, ఇంతపొద్దుపోయినదాకా ఇక్కడేఉన్నావా. అబ్బాయిపాపం చదువు కొంటున్నట్లుంది ఆటే పొద్దుపోయిందాకా చదవటమూ మంచిదికాదు. వాడు మరీపిచ్చినబడతాడేమో. నీవు కాస్తకని పెట్టిఉండమ్మా వెళ్ళు ళ్ళని చెప్పి క్రింద హాల్లోపడుకొంటానికి వెళ్ళిపోతాడు)

జయ—అల్లాగేనండి మామయ్యా-(అనిఅయన వెళ్ళి పోయినాడా లేదా అనిచూచి పెద్దగా) ఏమండోయ్ ఏంచదు వండీ! మరీ ఒకటే చదువా? అదేపిచ్చిన పడకూడదని మామగారుకూడా అన్నారు. ఇకపడుకోండి-(అని విరగబడి నవ్వుతుంది)

నా లు గో ర ం గ ం

(ఇంకోరోజురాత్రి. అదేపడకటిల్లు- అలంకారాలూ అవీమామూలుపద్ధతినే ఉంటాయి) బాబు పుస్తకం తెరచి ముందు పెట్టుకొంటాడు-గదిబయట హాలులో జయపడుకొని వుంటుంది.

బాబు—గాలిజోరుగా వీస్తున్నది. కాస్త కిటికీతలుపులు వేసి వెళ్ళు జయా.

జయ—కిటికీతలుపులు వేయటానికి నేను రావాలటండీ? మీరు వేసు కోండురూ.

బాబు — అవునులే- నిన్ను లేపటం ఎందుకూ? చదువుకొని పడుకొంటానుగాని నీవు మేలుకోక నిద్రపో.

జయ—అల్లాగే.

బాబు—మీాన పడుకోండా!

జయ—ఆ అది తొమ్మిదిగంటలకే పడుకొంది.

బాబు—అ హా. (ఒక్కక్షణంఉండి) అయితే-

జయ—అయితేలేదు. గియితేలేదు మీరు చదువుకోండి.

బాబు—చదువుకోనూ మరి చదువుకోకపోతే తప్పుతాను. తప్పితే నాన్నకు కోపం వస్తుంది. తప్పకుండా చదువుకొంటూ—(అని పుస్తకం ముందుపెట్టుకొని దీక్షగా చదువుతుంటాడు మరోనిమిషం అయింతరువాత)—జయా నీవేం చదివినట్లు కనపడవేం?

జయ—నా చదువు మీకేం కనపడుతుంది?

బాబు—నాన్నగారి కోరికసంగతి ఏంజేశావ్ ?

జయ—నేను మీమోస్తరుగాదండోయ్ ...చదువేమిటి అసలు నేను మెడలుకోసమే ప్రయత్నము చేస్తున్నాను మామగారి మనస్సు సంతోషిస్తుంది. చూడండి. నామాట అబద్ధమవుతుందేమో.

బాబు—చూద్దాం–చూద్దాం– (మళ్ళీ పుస్తకం చూస్తూ రెండు నిమిషాలు గడుపుతాడు) జయా.

జయ—అబ్బ ఎందుకండీ...అంతులేదు గద మీపిలువులకు ! ! !

బాబు—అదికాదు. శాలువ నాదగ్గర పెట్టావా?

జయ—తలదిక్కునే పెట్టా–అయినా ఉడకపోస్తుంటే శాలువమాటఎందుకు చెప్పండి? ఇక మాట్లాడించకండి. నేను తెల్లవారుఝామున లేచి చదువుకోవాలె.

బాబు—సరే–సరే—ఎబ్బేనాకేంపని ఇక మాట్లాడించటానికి!–(మళ్ళీ రెండు నిమిషాల వ్యవధి.) జయా!

జయ—అబ్బ ఎందుకండీ. ఇదేనా చదువూ ?

బాబు—ఒకనిద్ర పోయిలేచావు. నేనుచదువుతునే ఉన్నాను. అయితే మంచినీళ్ళు ఎక్కడపెట్టినట్టూ ?

జయ—ఏమో నాకు తెలియదు. మీ ప్రశ్నలకు నేను జవాబు చెప్పనూ లేనూ, చెప్పను.

బాబు—చెప్పాలె. చెప్పకపోతే ఎట్లా తెలుస్తుంది.

జయ—అవసరం వచ్చినపుడు ఎవరూ చెప్పకుండానే తెలుస్తయి. అసలు నాదగ్గరుంది రెండే పొరపాటంతా ? నేను ఇక్కడికి రాకుండా ఉంటే మీచదువు బాగాసాగుతుంది.

బాబు—నీవు రాకపోతే అసలే చదువుసాగదు, నీవు ఇక్కడ ఉండి ఏం కావాలంటే అది ఇస్తూఉంటే నేఏమన్నా చదువు సాగటం. అయినా నాన్నగారు ఏంజెప్పారు. ఇక్కడుండి కనిపెట్టి చూస్తూండ మన్లేదూ.

జయ—అందుకనే. మామగారు చెప్పినమాట వినకపోతే మహాపాపమనే నేను ఇక్కడ ఉంటున్నాను—

బాబు—మామగారి ఆజ్ఞను శిరసావహించడమూ, భర్తకు అన్ని విధాలాపధేయత చూపటమూ అను ఈ రెండు పనులుకూడా పుణ్య కార్యాలు సుమా జయా.

జయ—అయితే మీకు చదువుసాగటం ఎల్లాగో నాకు తెలియటం లేదు.

బాబు—ఇప్పుడు కొంత వరకు బాగానే సాగుతున్నది. ఇంకా ఎక్కువగా సాగుతుంది కూడా నేను కొంచెం మనస్సు దిట్టపర్చుకొంటే.

జయ—అదే, అదే నేనటం కాస్త ఆపని చెయ్యండి. మనస్సు గట్టిచేసుకోమనే నేనటం.

బాబు—చేసుకొంటాను—అంటున్నానుగా.

జయ—చేసుకొంటాను అంటానికేం — అంటునే ఉంటారు. నిబ్బరం ఏదీ ?

బాబు—అయితే ఇప్పుడే మనస్సు గట్టి చేసుకోమంటావా.

జయ—ఆ

బాబు—అల్లాగే. మనసా నామాట వినుమా. మర్యాద కాపాడుమా...(స్వ) యౌవనం పాలపొంగులాంటిది. క్షణభంగురం. గిర్రున కాలం తిరిగిపోతుంది. మిసమిసలాడుతూఉన్న ఈ శరీరం ముడుతలు పడుతుంది - (అని ఆగి బాబు జయవంక చూస్తాడు) (జయ నవ్వుతుంది) ముత్యాల కోవలాగున్న ఆ పలువరుస ఎడమిచ్చి చివరకు రాలిపోతుంది.

(జయ నవ్వి ఆశ్చర్యంగా చూస్తుంది) తళతళ లాడుతూఉన్న ఆ కళ్ళు ఎప్పుడో ఒకసారి తేజోవిహీనం కాకమానవు.

కాబట్టి ఓ మనసా. పిచ్చి ఊహలను కోరికలను పెట్టుకోకు. కామమా నను వీడిపొమ్ము, మోహమా నీకును నాకును ఋణము తీరినది. ఇంద్రియనిగ్రహశక్తి ఇకనిన్నునే నారాధింతును. శాంతిమా నా హృదయ పీఠమును అలంకరించుము.

తమసో—మా—జ్యోతిర్గమయ

అని ప్రార్థనచేసి—కళ్ళునలుపుకొని తెరిచి చూస్తాడు సీరియస్‌గా జయవంక.

జయ—అబ్బ ఏమి వేళాకోళం అండీ.

బాబు—వేళాకోళం కాదు మనస్సు గట్టి చేసుకోమంటే చేసుకొన్నాను. ఇక చూశావ్రా గుండెచాలా నిబ్బరంగాఉంటుంది. ఘట్టిగా ఉంటుంది! అంటే ఇంద్రియనిగ్రహమన్నమాట!

జయ—అయితేసరే. నేవెళ్ళుతా. (వెళ్ళబోతుంది)

బాబు—(ఆమెనుకూర్చోబెట్టి) వెళ్ళుదుంగాని లేఉండు సంగతంతా విను. ఇప్పుడుచాలా గొప్పపని అయిపోయిందన్నమాట! నిగ్రహం సంపాదించాను.!!

జయ—సరే—(అని మళ్ళీ వెళ్ళబోతుంది)

బాబు—(మళ్ళీ బుజాలు పట్టికూర్చోబెట్టి) ఏమిటో మనస్సు ఎల్లాచెప్పితే అల్లావింటుంది. చదువుకొనే వాడికి ఈ మాత్రం గుండె నిబ్బరం ఉండొద్దూ? ఏమంటావు?

జయ—మళ్ళీ ఇంకోసారి లేస్తుంది ఉండాలండి తప్పక ఉండాలె. ఇక నన్ను వెళ్ళనివ్వండి.

బాబు—(మళ్ళీ కూర్చోబెట్టి)—నీవు చెప్పినట్లు నే విన్నాను. చూశావా. మనస్సుకు బుద్ధి చెప్పుతున్నా గుండె నిబ్బరం కలిగింది! చూడు ఇంకా (అని ఆమెదగ్గర కెళ్ళి నో. బడు తాడు—ఆమె మాట్లాడక నవ్వుతుంది) —చూ-

మరిగుండె. ఎంతనిబ్బరంగా ఉందో—(అని ఆమె చెయ్యి పట్టుకొని తనగుండెపై ఆనించుకొంటాడు!—నవ్వుతాడు)

జయ—నిజమే! అబ్బ...ఎంతఘట్టిగుండె అయిందండీ నిమిషంలోకి...!! ...(వేళాకోళంగా ఆశ్చర్యంగా) అంటుంది...గుండె అంతా తడివి చూచి జయ...మహా ఎక్కువగా ఆశ్చర్యపోయినట్లు నటిస్తుంది. మళ్ళీ మళ్ళీ ఎంత ఘట్టి గుండె అయిందండీ నిమిషంలోకి అంటుంది; బాబూ చాలా గర్వంగా ఘనకార్యం చేసిన వాడిలాగ ఛాతి విరిచి ఆమె వంక చూస్తాడు—

తెర

VI

అయిదోరంగం

(హాల్లో బాబూ బల్లపక్కని కుర్చీలోకూర్చుని ఉంటాడు. కొంచెందూరంలో జయ ఆతనికి ఎదురుగా మరో కుర్చీలోకూర్చుని ఉంటుంది. మీనా బావకుదగ్గరగా కూర్చుని కథలపుస్తకం చదువుతూ ఉంటుంది. సమయము ప్రొద్దున ఏడుగంటలు)

జయ—ఇంక ఎన్నాళ్ళోలేదు. మీపరీక్షలు దగ్గరకొచ్చినై.

మీనా—ఇప్పుడేం పరీక్షలే అక్కా! ఇంకా ఆరునెలలు రింటాట.

జయ—అవుననుకో. అయినా చదవాలె.

మీన—కష్టపడి చదువుతునే ఉండేగదే బావ?

జయ—నీవు సంతోషించాలె. (వెక్కిరింతగా)

బాబు—చూశావా మీనా. నేను చదవటం లేదూ?

మీన—ఏం మాటలే అక్కయ్యా అవీ! పాపం చదువుతునే ఉంటే?

బాబు—నేను నిన్న జ్యోతిష్కుడు దగ్గరకూడా వెళ్ళొచ్చాను. నాకు ఇవి శుభదినాలు. తప్పకుండా మేలు కలుగుతుందన్నాడు.

జయ—నక్షత్రం బల చేతే ప్యాసు కావాలె అయితే!

బాబు—నిజానికి అంతే. ప్యాసు కావటం అనేది కష్టపడి చదవటంలో ఉండదు, అదో గాలిపాటు.

మీన—అంతే. అంతే. (అంటుంది పుస్తకంచూస్తూ)

బాబు—అయితే నీవు పరీక్ష కెళ్ళటం మాటా?

జయ—డబ్బు కట్టారా?

బాబు—కట్టలేదు, రేపు పంపుదామను కొంటున్నా.

జయ—వద్దు. పంపబోకండి.

బాబు—ఏం, పరీక్ష కెళ్ళవా?

జయ—ఊఁహు...

బాబు—ఏం?...

—(మాట్లాడదు)

బాబు—చదవకపోతే మానేపరీక్ష కెళ్ళటంమంచిది. ఊరికేనే ప్యాసు చేస్తారు.

జయ—అయినా వెళ్ళను.

బాబు—వెళ్ళాలె. తప్పదు.

(నవ్వుతుంది. అక్కయ్యనుజూచి... అక్కమీనను జూచినవ్వుతుంది. బాబుకేం బోధపడదు ఏదో కుట్ర అనుకుంటాడు.)

బాబు—ఇవన్నీ సాగవు. వెళ్ళి తీరాలె. (అధికారిలా అంటాడు.)

జయ—అల్లాగే లెండి—(ఉదాసీనంగా)

మీన—అబద్ధం ఎందుకే అక్కయ్యా. వెళ్ళనని స్పష్టంగా చెప్పరాదూ?

బాబు—ఎంచేత వెళ్ళవూ? వెళ్ళకపోతే నేనొప్పుకోను

మీన—నీవు ఒప్పుకోనేదేమిటి? అక్కయ్య పరీక్షకు వెళ్ళదు బావా. దానితరువాత నీఇష్టం!!

బాబు—ఎందుకు వెళ్ళదో నాకు చెప్పకపోతే, నేనొప్పుకోను.

మీన—చెప్పవే—అక్కా చెప్పు. చేసిన పాపం చెపితేపోతుంది.

జయ—పాపం లేదు గీపం లేదు?

మీన—చెప్పవే (బ్రతిమలాడినట్లు — నవ్వుతుంది పెద్దగా)

జయ—ఏం జెప్పాలే ఏదో ఉన్నట్లు!!

బాబు—చాలా గొడవగా ఉందే వ్యవహారం—(విసుగ్గా) పరీక్షకు కూర్చుని తీరాలె. తెలిసిందా!

మీనా—వెళ్ళదు బావా ఏం. చేస్తావో చెయ్యి!

బాబు—వెళ్ళకపోతేనా ఎరగదూ!

మీనా—ఏం చేస్తావో!

బాబు—నేను ఇక మాట్లాడను.

మీనా—వెళ్ళుతుందిలే బావా. వెళ్ళుతుంది మెడలు కోట్టేస్తుంది చూస్తుండు (దీర్ఘాలుతీస్తూ అంటుంది.)

బాబు—దేముడు మేలుచేస్తే మెడలూ రావచ్చు. దానికేం అసలు పరీక్షకు కూర్చోటం అవసరం.

జయ—అల్లాగే (అని మీనా వంకజూచి విరగబడి నవ్వుతుంది. మీనా కూడా విరగబడి నవ్వుతుంది)

మీనా—(బావదగ్గరకొచ్చి బుజంమీద చెయ్యి వేసి ఊపి) పిచ్చిబావ ఏం తెలియదు!!

బాబు—నాకు తెలుసు లెద్దూ మీటక్కరు వేషం ఈ టక్కరుతనం నాదగ్గరసాగదు. తెలిసిందా

మీనా—సాగదా? సాగి అప్పుడే ఎన్నాళ్ళయింది— (నవ్వు) (బాబుకు అనుమానం కలుగుతుంది. అనుమానంగా చూస్తాడు జయవంక. జయ తలొంచుకుంటుంది. మీనా వంక చూస్తాడు.మీనా నవ్వుతుంది, బాగాఅనుమానంకలుగుతుంది)

బాబు—(కొంచెం భయం, కొంచెంసిగ్గు కలిగినవాడిలాచూస్తూ) అయితే జయా...అదేనా? (జయ మాట్లాడదు మీనా విరగబడి నవ్వుతుంది)

మీనా—ఆ. అదేనా.........ఆఁ అదేనాజయక్కా ఆ అధేనా... బాఛా...ఆ అదేనా...(అని వెక్కిరించివిరగ

బడి నవ్వుతుంది అదేనవ్వటం కాసేపు అయిన తరువాత బాబు తెప్పరిల్లి చూస్తాడు)

బాబు—సరే. అయితే మీనా మీ అక్కయ్యపరీక్షకు వెళ్ళటానికి బొత్తిగావీల్లేదా.

మీన—(వేళ్ళమీద లెఖ్ఖపెడుతూ) - కార్తీకం, మార్గశిరం, పుష్యం, మాఘం, ఫాల్గుణం - (అని ఒక్కొక్క మాటే-మెల్లగా, విని వినపడని గొంతుకతో అని పెద్దగా) ఆఁ హాఁ వీల్లేదు బావా-బొత్తిగావీల్లేదు.

బాబు—సరే. సరే. (అంటూ వెళ్ళిపోతాడు)

ఆ రో రం గం

[జయ అత్తగారిఇల్లు. హాలు. మీన అటూ ఇటూ హడావుడిగా తిరుగుతూ ఉంటుంది. హాలుపక్కన గదినుంచి పంతులు ప్రవేశం]

పంతులు—మీనా.

మీన—ఎందుకండీ-మామయ్యా

పంతులు—లేడీ డాక్టరు వచ్చిందికదూ.

మీన—ఆ వచ్చింది. ఇంకా పదినిమిషాలు.

పంతులు—మీ అత్తయ్య కూడా గదిలోనేఉందా.

మీన—అత్తయ్యా, రత్తమ్మగారు—పిన్ని అంతా ఉన్నారు మామయ్యా. మీరు అల్లాగకుర్చీలో కూర్చోండి గడియారంచూస్తూవెళ్ళిపోతుంది. (పదినిమిషాలైనతరువాత)

పంతులు—మీనా.

మీన—(లోపలినుంచి వచ్చి-)ఏం, మామయ్యా—ఎందుకూ పిలిచారూ?

పంతులు—తగ్గ లేదూ—

మీన—లేదు మామయ్యా లేడీడాక్టరు దగ్గరేఉంది. మీరు ఊరికే ఆదుర్దాపడకండి.

పంతులు—నీవు నా దగ్గర ఉండు అమ్మా మీనా.

మీన—(నవ్వి) ఎందుకండీ మామయ్యా మీకు కూడా నొప్పులొస్తున్నాయ్యా.

పంతులు—అంతకంటె ఎక్కువగానే ఉంది మీనా అక్కయ్య ఏమంటున్నది మీనా.

మీన—(వెళ్ళిపోతూ)—ఏమంటుందండీమామయ్యా పెద్దగానవ్వి

రావే రావే బంగరు పాపా

(అంటూపరుగెత్తుతుంది)

(మరి పదినిమిషాలైనతరువాత)

పంతులు—మీనా, మీనా.

మీనా—(లోపలినుంచే)—ఆఏం మామయ్యా.

పంతులు—ఏం?

మీన—ఏం, లేదు మామయ్యా -

పంతులు—లేడీడాక్టరుతో చెప్పుకాస్త జాగ్రత్తగా ఉండమని.

మీన—ఆ అల్లాగే...

(మరి అయిదు నిమిషాలు తరువాత)—

పంతులు—మీనా, మీనా.

మీన—ఆవస్తున్నా మామయ్యా. (పరుగెత్తుకొని వచ్చి ముసలాయన చెవులో)—మామయ్యా ఇంకా అయిదు నిమిషాలట (లోపలికి వెళ్ళిపోతుంది)

బాబు—(ప్రవేశించి)—నాన్నగారూ- బి ఏ ఫస్టుక్లాసులో ప్యాసు అయినానండి!

పంతులు—మాతండ్రే - మానాన్నే, ఫస్టుక్లాసులో ప్యాసుఅయినావా? మాతండ్రే-!!

(లోపలినుంచి పసిపిల్ల ఏడ్పు వినవస్తుంది. బాబు ఆశ్చర్యపడి సిగ్గుపడుతాడు......)

పంతులు—మీనా, మీనా.

మీన—(పరుగెత్తుకొచ్చి) మామయ్యా, ఫస్టుక్లాసులో ప్యాసు అయింది అక్కయ్య!

పంతులు—మాతల్లె—మాకన్నతల్లి చల్లనికబురు చెప్పావు—బాబు ప్యాసుఅయినాడనికూడా ఇప్పుడేవిన్నాను

మీన—బావ, వచ్చేడే—బావా-అక్కయ్య మెడలు కొట్టేసింది, ఫస్టుక్లాసు మెడల్ బంగారపు మెడల్ రత్నాల మెడల్—

బాబు—అరే!- ఏమిటీ!-మీనా!అప్పుడేతమాషాగా ఉందే—

మీనా—తమాషా-కాదు బావా!! చాలాతమాషా!!

ఏడవకు ఏడవకు-వెఱ్ఱిఅబ్బాయి
ఏడిస్తె నీ కండ్ల-నీలాలు కారు
నీలాలు కారితే-నేజూడ లేను జోజో!

ఇంద్ర కన్యలొచ్చి-నిన్ను లే పేరు
భద్ర కన్యలొచ్చి-పాట పాడేరూ,
నాగ కన్యాలొచ్చి-నాట్య మాడేరూ
దేవ కన్యాలొచ్చి-వీణ మీటేరూ

నిద్రపో పాపాయి-నిద్రపోవయ్యా.

ఎ లో ప్ మెం టు

౧

('కాంతమ్మ, లక్ష్మమ్మ, పెద్దపిల్ల, చిన్నపిల్ల, శాస్త్రి రాధ, విజయ, అంతా హాలులో ఉంటారు. కాంతమ్మ పెద్ద తల్లికి తలదువ్వుతున్నది. లక్ష్మమ్మ చిన్నపిల్లకు తలదువ్వు తున్నది. విజయ బొమ్మతో ఆడుకొంటున్నది. రాధా, విజ యలు దూరంగా కూరలను అమతుంటారు')

లక్ష్మమ్మ—ఏమిటో వదినా, చిన్నప్పుడు చేస్తే నే బాగుంటుంది బొమ్మల పెండ్లిళ్ళలాగ, ముద్దు ముచ్చట తీర్చాలంటే చిన్నతనంలోనే, పెండ్లి చెయ్యాలె, గడ్డాలు మీసాలు వచ్చినతరువాత పెండ్లేమిటి నాముఖం! ఒక గం ధంపూసినా, పూల చెండ్లాడినా పసివాళ్ళు చేస్తేముచ్చటగా ఉంటుందిగాని, వయస్సు వచ్చి ఆంబోతుల్లా తయారైనతరు వాత ఏంపెండ్లి అమ్మా!

కాంతమ్మ—అవునమ్మా వదినా, ఆమాటనిజం, చిన్నప్పుడే అయితే, అల్లుడు, అత్తయ్యాఅని పిలవటం ఆపే క్షపడటం ఉంటుంది. ఈడొచ్చిన పిల్లలకు పెండ్లి చేస్తే, ఆ మొగుడూ పెళ్ళాంఅతుక్కుపోతారేగాని, అత్తకూమామకూ అచ్చట్లు ముచ్చట్లు తీరవు. నాకు పెండ్లి అయినప్పుడు నేను

ఎనిమిదేండ్లదానిని, మేజువాణీలో పెండ్లికొడుక్కు గంధం పూస్తూ చెంపమీద ఛెళ్ళున కొట్టాను. పసిదాన్ని నాకేం తెలుసు ఎవరో చెప్పారు, అల్లాగ చేయమని

లక్ష్మమ్మ—నా పెండ్లిలో ఏమైంది అనుకున్నావు వదినా...నీవు అప్పటికింకా కాపరానికిరాలేదు. జ్ఞాపకం ఉందోలేదో, పెండ్లి అయిపోయింది. మూడు నిద్రలకొచ్చినప్పుడేనా, ఆఁహా కాదు, కాదు మూడు నిద్రలు అయిపోయినై. పదహారు రోజుల పండుగనాడు. ఏమైంది అనుకున్నావ్. ఆయన ఏమన్నా నడవాలో మంచంమీద పడుకొని నిద్రపోతున్నారు, భోజనాలైన తరువాత. ఆయనకైనా అప్పుడు వయస్సు పదిహేనో, పదహారో వుంటాయి ఫిప్పు. ఫారంగా బోలు చదువుతున్నారు. ఏమైందనుకున్నావ్ వదినా (నవ్వుతుంది)

కాంతమ్మ—చెప్పి నవ్వు. సంగతి తెలిస్తే మేమూ నవ్వుతాము.

లక్ష్మమ్మ—అప్పుడాయనకు పిలకుండేది. 'విరగబడి నవ్వుతుంది' నిద్రపోతున్నపుడే మెల్లిగా దగ్గర కెళ్లి ఆపిలక్కు తాడుగట్టి దాన్ని మంచానికికట్టాను (విపరీతంగా నవ్వు) వెధవది చూశావా, ఎంతచిన్నతనమో (నవ్వు - ఆపుకొని) అట్లాగే...ఇంతకూ చెప్పొచ్చింది ఏమిటంటే, చిన్నతనంలో పెండ్లి చేస్తేనే సరదాగా కుంటుంది. మీ విజయ, మా రాముడు ఈడూ జోడుగా ఉన్నారు. ఉ...అదీగాకా...పరాయి సంబంధంకాదు మేనత్త మేనమామబిడ్డలూ...చక్కగా

చిలకాగోరంకలా ఉంటారు....నేననటం ఏమిటంటే వాళ్ళిద్ద రికి ముడి పెడదామని.

పెద్దపిల్ల—రాముడు బాగానే ఉంటాడే అమ్మా చేస్తే...బాగానే ఉంటుంది.

చిన్నపిల్ల—ఆ విజయ చిచింద్రీ రాముడు పట్టి బండ రాముడు, వాడ్ని వంగతీసి గుద్దుతుంది.

లక్ష్మమ్మ—రేపు నీమొగుడ్ని నీవు—పూలల్లో పెట్టి పూజిస్తావేమో చూస్తాగా ?

రాముడు—ఏమే అమ్మా విజయను నాకిచ్చి పెండ్లి చేస్తారా ? నేను విజయను చేసుకోంటాన ! (అనిఎగురును)

౨

(కాంతమ్మ ఇల్లు, పిల్లలతో కాపురం. అంతాచిన్న వాళ్ళు...రంగస్థలం వంటిల్లు.)

శాస్త్రి—అమ్మా, అమ్మా,

రాధ—పిలవబోకురా, అమ్మ దొడ్లో పూజచేసు కొంటూంది.

శాస్త్రి—చూడవే అమ్మా, పెద్దక్కయ్యచూడూ,

కాంతం—దొడ్లోనించే పెద్దతల్లీ, ఒక్కనిమిషం ఊరుకోఅమ్మా పూజ చేసుకొని వస్తున్నాను.

పొడుస్తూబాలుడూ పొన్న పువ్వూచ్ఛాయ
పొన్నపువ్వూమీద బొగడ పువ్వూచ్ఛాయ
శ్రీసూర్యనారాయణా !
మేలుకో హరి సూర్యనారాయణా.

శా(స్త్రి—చూడవే అమ్మా అక్కయ్య నన్ను అధోగతివాడా అంటోంది.

పెద్దపిల్ల—నే నేమన్నారా, వెధవ అన్నీ కల్పించుకొంటావు, అధోగతి వెధవవు.

శా(స్త్రి—అమ్మా చూడవే

కాంతమ్మ—వస్తున్నా, నాయినా వస్తున్నా ఒక్క నిమిషం పోట్లాడకుండా ఉండండ(రా

ఉదయిస్తూ బాలుడూ ఉల్లి పూవూచ్చాయ
ఉల్లిపువ్వామీద ఉ(గంపు పొడిచ్చాయ
(శ్రీ) సూర్యనారాయణ
మేలుకో హరి సూర్యనారాయణా
మధ్యాహ్న బాలుడూ మల్లిపువ్వాచ్చాయ
మల్లెపూవ్వామీద మంకెన్న పొడిచ్చాయ
(శ్రీ) సూర్యనారాయణ
మేలుకో హరి సూర్యనారాయణ.

విజయ—అమ్మా అమ్మోయి...బావ చూడవే

కాంతమ్మ—(లోపలికొచ్చి) ఏమిటేపాపా, ఏమిటే సీగొడవ?

విజయ—బావ చూడమ్మా ఏమంటున్నాడో,

కాంతమ్మ—రాముడూ, ఏమన్నావురా, దాన్ని, దాన్ని ఏమన్నావు?

రాముడు—నే నేమన లేదు అత్తయ్యా,

కాంతమ్మ—మరి ఎందుకు అది ఏడుస్తుంది

విజయ—ఏమీ అనలేదేం. అబ్బానంగనాచీ లెంగ బుర్రాను.

రాముడు—(నవ్వుతాడు)

విజయ—అదిగో మళ్ళీ నవ్వటం ఎందుకేం ?

అందరు—(నవ్వుతారు.)

విజయ—అదుగోనే అమ్మా అంతా నవ్వుతున్నారు. నేను అన్నం తినను.

కాంతమ్మ—అట్లా చిందులు తొక్కుతా వెందుకే. నవ్వితేఏం? నవ్వారని అన్నం మానేస్తావా ? రా మా అమ్మ గదూ రా తల్లీ.

విజయ—ఊరికే నవ్వటం కాదే బావ చూడు.

కాంతమ్మ—మాతల్లిరా, నేనుబావనుకూక లేస్తాగా, ఏమిరా రాముడూ, పాపనేమన్నావు. ?

రాముడు—నన్నేమన్నదో కనుక్కో అత్తయ్యా,

కాంతమ్మ—ఏమన్నావే ? మాట్లాడవేం ?

శాస్త్రి—బావ బావ పన్నీరూ, బావను పట్టుకు తన్నేరూ, అని పాటపాడిందే అమ్మా

విజయ—ఆ...పాడేను. పాడితే ఏం తప్పా ?

కాంతమ్మ—ఏంతప్పు లేదమ్మా, ఓస్ ఇంతేకదా,ఆ, పాడితేవాడేమన్నాడే నీవు ఏడ్వటానికి ?

విజయ—పాడితేవమన్నా, పాడితే బావనన్ను... ఎందుకనాలేం!

కాంతమ్మ—ఏమన్నాడో చెప్పవేం ?

పిల్లలు—చెప్పూ, చెప్పూమజీ... (నవ్వుతారు), చెప్పూ బుంగమూతి పెడతావేం ?

విజయ—ఊ, ఊ, బావటానన్ను పెండ్లిచేసుకొని, నన్నే తంతాడుట! (ఏడుస్తుంది)

కాంతమ్మ—ఓస్ ఇదా ఇంతకూ సంగతీ, పెండ్లి అయిన తరువాతి సంగతిగదా ? దానికి యిప్పటినుండీ ఏడ్వ టంఎందుకులే. అయినా ఇప్పటికాలంలో పెళ్ళాలు మొగుళ్ళ నేపట్టుకు తంతున్నారు.

విజయ—నేనే తంతా నిన్ను

రాముడు—పెండ్లిగానీ మరి

కాంతమ్మ—ఏమన్నాడే, మరీ ఇదౌతావు, వగలు పోతావు, వగలుమారి వంకాయవు, తినుతొందరగా.

విజయ—బావా వాళ్ళంతా తినిపోయినారే అప్పుడే!

కాంతమ్మ—నీవుకూడా తినుమరి, వెళ్ళి వాళ్ళతో కలిసి ఆడుకొందువుగాని,

విజయ—బావదగ్గర మంచిబొమ్మలున్నాయె అమ్మా

కాంతమ్మ—టక్కరులంజ, బావఅంటేఇష్టమేమళ్ళీ!

వీధి కుమ్మంలోనుంచి

వెండి కొండలా ఈశ్వరుడండీ

భమిడి కొమ్ములా బసవయ్యండీ

ఏడుకొండలా వెంకన్నండీ,

డూ, డూ, డూ, డూ, వెంకన్నా.

అదిగో గంగిరెద్దు వచ్చింది. ఒక్కముద్దతిను చెయ్యేది చెయ్యకడుక్కొని వెళ్ళవే, పాపా ఇటురా మూతినిండా ఎంగిలే—ఊఁ ఇఁహ వెళ్ళు...

3

("వంటిల్లు—కాంతమ్మ కూరలు తరుగుతూఉం టుంది కాంతమ్మ ఆడబిడ్డ లక్ష్మమ్మ వంటలోవుంది."

కాంతమ్మ—ఇవ్వాళనీవు మడికట్టుకున్నావు కాబట్టి నాకుకాస్త చెయ్యి తెరిపిఅయింది. రోజూనూ చాకిరే కదమ్మా నేనూ పెద్దదాన్ని అయిపోయినాను వదినా. ఇంక చెయ్యలేను.

లక్ష్మమ్మ—ముప్పై ఏళ్ళకే వచ్చిందా ఏం ముసలిత నము! ముక్కలైన ముసలితనము! వెంటవెంటనే కాన్పులు రాబట్టి అయిదుగురు పిల్లలతల్లివైనావు కాని లేకపోతే పైలాపచ్చీసు మీాద ఉండాల్సిన వయస్సుకాదూ!

కాంతమ్మ—వయస్సా, నావయస్సే చెప్పాలి, ముసలిదానినై కూర్చుంటే,

లక్ష్మమ్మ—అప్పుడే ఏమైందివదినా, ఇంకాకోడళ్ళు రావాలె, అల్లుళ్ళురావాలె. నడుంవంగాలె, (దీర్ఘాలతో)

కాంతమ్మ—నిజానికి అంతేగాని నేనుమటుకు బీద ఇంటిపిల్లనైనానరే, నాకుకాస్త చేతికక్కరకొచ్చే పిల్లను చేసుకోవలెనని ఉందివదినా?

లక్ష్మమ్మ—కోడలొస్తే మటుకు అక్కరకొస్తారా ఏమిటో? మన మనుకోటమే కాని అది వచ్చేసరికి, అత్తకూ పుడుతుంది రిమ్మ—ఏదో పాటంవుంది ఎరుగవూ?

కొడుకు పుట్టాడంటె కొండ కెక్కుదురు,
కోడలొచ్చిందంటె రచ్చ కెక్కుదురూ ..అనీ

అయితే ఏదో మాటొచ్చింది కాబట్టి అంటున్నాను వదినా, పెద్దపిల్లలిద్దరూ మా రాముడికి ఈడుగాక పోయిందీ, ఈ విజయను మా రాముడుకిచ్చి పెండ్లి చెయ్యాలె. మా అన్నయ్యతో వియ్యం పొందాలని నాకు చిన్నప్పటినుంచీ కోరిక. ఏం వదినా?

కాంతమ్మ—నా దేముందమ్మా, మీ అన్నయ్య ఇష్టం మీ ఇష్టం.

లక్ష్మమ్మ—ఏం శాణితనమమ్మా, బొత్తిగా నీ పెత్తనం లేనట్టే మాట్లాడుతావు. అయినా నిజానికి మా అన్నయ్య దేముంది?

కాంతమ్మ—ఇవ్వటానికి నాకేం అభ్యంతరం లేదు వదినా రాముడికి చదువు చెప్పించు వాడుగనుక స్కూలు ఫైనల్ ప్యాసు అయినాడా విజయనిచ్చి ముడేస్తాం.

లక్ష్మమ్మ—ఏమోనమ్మా యింగ్లీషు చదువులేమి చెప్పిస్తామో, పల్లెటూరి వాళ్ళం, ఆ ఊళ్ళో వున్నంత చదువు చెప్పిస్తాం. ఆపైన బస్తీ కాపురం పెట్టి చెప్పించడానికి ఆయన ఏమంటారో.

కాంతమ్మ—చదువు లేకపోతే పిల్లనియ్యమమ్మా వదినా.

లక్ష్మమ్మ—ఇప్పుడు ఈ చదువులు రక్షిస్తయి! మా అన్నయ్య చదివాడు బి. యె. టి. యల్. ఏంలాభం—రేపు మా అబ్బాయి చదివినా అంతేగా.

కాంతమ్మ—ఏంలాభం లేకేం, నెలకు నూరురూపాయలు సంపాదిస్తూన్నారు.

లక్ష్మమ్మ— సంపాదిస్తూన్నాడు (ఉసడింపుగా) సాహేబు సంపాదన అంతా బూబుకుట్టుపోగులకుసరి. సెంటు భూమి లేదూ, చారుడు గది లేదూ తలదాచుకోంటానికి.

కాంతమ్మ— ఏం ఎక్కిరిస్తావు వదినా, మీకు కాంగా పది ఎకరాలభూమి ఉండనీ, భూమి ఉంటే ఏం లాభం? తినటం ఆ కుక్కిమంచంలో కూర్చుని ఊగటమేగా, పది మందిలోకి వెళ్ళటమూ, మన్ననా ! మర్యాదా ?

లక్ష్మమ్మ—మన్ననా మర్యాదా ఉన్నయి మా అన్నయ్యకు...ఏంలాభం పట్టుమని పదిరూపాయలు కావాలంటె పెట్టెలోవుండవు. అర్ధరాత్రివేళవచ్చి అడిగినా మీఅన్నయ్య ఇనప్పెట్టెతీసి నాలుగొందలు అయిదొందలు,ఎంత కావాలంటే అంత, దొంతర్లు దొంతర్లుగా తీసిఇయ్యగలడు. ఏమిటోబ స్త్రీ సంపాదనంతా అదో చిత్రం. నాలుగువందలు సంపాదిస్తున్నా ఆయనకూడా మంగలినికూడా రేపిస్తానుపోరా, అంటాడు.

కాంతమ్మ—అవునమ్మా వదినా, మాదగ్గర డబ్బులేని మాట నిజమే. ఏదో సంపాదించుకొంటున్నాం. తింటున్నాం

బీదవాళ్ళమే. మాపిల్లను నీవు చేసుకోకు. నీ పిల్లను మా కియ్యకు. అంతేగా.

లక్ష్మమ్మ—అదేమిటి వదినా అట్లా అంటావు. మా రాముడికి చదువులేదని నీవేగా పిల్లనియ్యనన్నావు. నేను చేసుకోనన్నానా ?

కాంతమ్మ—వాడుచదువుకొంటే ఇస్తాను. చదువు కోకపోకపోతే ఇయ్యనిమాట నిజమే.

లక్ష్మమ్మ—పోన్లేవదినా. ఇయ్యకపోతే పెండ్లికాక పోదూ. ఏదో అన్నయ్యకూతుర్ని చేసుకొందామనిగానీ, మావాడికి రేపీపాటికి బంగారపు బొమ్మలాంటిపిల్లను చేస్తాను

కాంతమ్మ—అయ్యో. అదేమిటివదినా, ఆ మాత్రా నికి అల్లా ఇదై పోతావేమమ్మా ! అయినా ఎప్పటి మాటో, భగవంతుడు, సరిగ్గాచూస్తే ఇంకా అయిదా రేండ్లమాట ఊరికేనీవు ఇదౌతావేమిటి? అయినా వాడికి చదువురాదని నీవు అనుకోటం ఎందుకూ ! నిక్షేపంలాగ వస్తుంది. బియ్యే ప్యాసు అవుతాడు. అప్పుడు నేను విజయనిచ్చి పెండ్లిచేయక మాననూ.

లక్ష్మమ్మ—ఏమో నీమాట చలువవల్ల అంతవాడు కావాలగదా ! ఇప్పుడు ఆకుంక నాలుగోక్లాసట. తప్పాడు వెధవ క్రిందటి సంవత్సరం.

విజయ—(అప్పుడే ఆ మాటవిని) బావ నాలుగు తప్పాడు అత్తయ్యా (నవ్వి)

తప్పాడు, తప్పాడు, నాల్గోక్లాసూ తప్పాడూ
చదవాడూ, చదవాడూ, పాఠాలేమీ చదవాడూ.
మెక్కాడూ మెక్కాడూ, చక్కిలాలూ మెక్కాడూ,
బొక్కాడూ బొక్కాడూ అటుకులన్నీ బొక్కాడూ,
తింటాడూ తింటాడూ తేరతిండి తింటాడూ
ఆడాడు ఆడాడు అల్లరిపిల్లల గూడానూ
కొట్టాడూ కొట్టాడూ ఆటలో అబ్బయ్యను కొట్టాడూ
అప్పుడు వాళ్ళనాన్న వచ్చాడూ
బెత్తం ఒకటీ తెచ్చాడూ,
స్తంభానికికట్టారూ
'అని పాడుతూ వెళ్ళిపోతుంది'

లక్ష్మమ్మ—ఇదెప్పుడొచ్చిందమ్మా వదినా

కాంతమ్మ—నేనూ చూడలేదూ వదినే, దీన్ని చేసికొని నీవే సుఖపడతావమ్మా!

లక్ష్మమ్మ—మరేం ఫరవాలేదూ, పెద్దయితే అన్నీ పోతయి. ఒక పిల్లపుట్టిందాకా ఇట్లాగే ఉంటుంది ఎగురుడు. వదినా నీవెళ్ళి పిల్లలకు నీళ్లు అవీపోసుకో పొద్దుకూక వస్తున్నది. అయిదైనట్లుంది నేనే వంటచూస్తాను నీవెళ్ళు.

౪

(ఇంట్లో ముందున్న పెద్దహాలు రంగస్థలము. మేడపైన పిల్లలంతా ఆడుకొంటూంటారు. రాముడు, విజయ హాలులో ఉంటారు. విజయ బొమ్మల పెండ్లి చేస్తున్నది.)

విజయ—బావా నీకు పెండ్లిమంత్రాలువచ్చా?

రాముడు—ఎందుకే విజయా.

విజయ—బొమ్మల పెండ్లి చెయ్యాలె. అన్నీసిద్ధమైనవి. బ్రాహ్మడు దొరక లేదు.

రాము—బొమ్మలపెండ్లి ఎందుకుగానీ నిజం పెండ్లి చేద్దామూ?

విజయ—నిజం పెండ్లిఎట్లాగురా చేయటం

రాముడు—మనం ఇద్దరం పెండ్లి చేసుకొంటిమా, నిజం పెండ్లిఅయిపోతుంది.

విజయ—మనఇద్దరికి పెండ్లా, బలే తమాషామాట అన్నావే. ఇందాకా అమ్మానాన్నాకూడా ఈమాటే అనుకొన్నారు.

రాముడు—ఏమనుకొన్నారే విజయా చెప్పవూ?

విజయ—మానాన్న. నన్ను నీకిచ్చి పెండ్లిచేస్తానన్నాడు, మాఅమ్మ వద్దన్నది:

రాముడు—అవునే. విజయా, మా అమ్మకూడా నిన్నే పెండ్లి చేసుకోమని నాకెన్నో సార్లు చెప్పింది.

విజయ—ఆఁహా

రాముడు—ఆఁహా కాదు. మరి నీకిష్టమేనా?

విజయ—అమ్మ వద్దన్నదిగా?

రాముడు—అత్తయ్య వద్దంటేఏంలేవే. మనం ఇద్దరం పెండ్లి చేసుకుందాం.

విజయ—అమ్మో అమ్మ తంతుంది.

రాముడు—(విజయను కావలించుకొని)విజయా మనం తప్పకుండా పెండ్లి చేసుకొందాం బలేసరదాగా ఉంటుంది. ఎంత తమాషాగా ఉంటుందనుకొన్నావ్.

విజయ—మా అమ్మ చూస్తే తన్నదురా?

రాముడు—అవుననుకో, అత్తయ్య తంతుంది కాని. అత్తయ్య చూడకుండా చేసుకొందాం

విజయ—(పెద్దగా నవ్వుతూ) ఎవ్వరూ చూడకుండా పెండ్లేమిటిరోయ్. మేళాలు తాళాలు ఏమీ లేకుండా నేనా పెళ్ళి?

రాముడు—అదికాదే. చూడూ ఒక తమాషా చేద్దాం మనం ఇద్దరం కలసి సాయంత్రం వెళ్ళిపోదాము.

విజయ—ఎక్కడికి?

రాముడు—ఎక్కడికేమిటి తాతయ్యగారి యింటికి.

విజయ—అమ్మో గుంటూరు తాతయ్యగారింటికా? అమ్మో అక్కడికి ఎల్లాగ వెళ్ళటం.

రాముడు—రైలు మీద గుంటూరు పోలేమూ? అయ్యో... నేను ఎన్నిసార్లు రైల్లో ప్రయాణం చేశానో నీకు తెలుసా లక్షసార్లు గుంటూరేమిటి మెడ్రాసుదాకా పోగల్దును!

విజయ—అబ్బ! మెడ్రాసే! అయ్యబాబో! నీవొక్కడివే!

రాముడు—ఆ నేనొక్కడ్నే! మద్రాసేమిటి! ఇంకా ఎంత దూరం పొమ్మన్నా నాకేం భయం లేదు.

విజయ—మెడ్రాసుదాటినతరువాత ఏముందీబావా!

రాముడు—అక్కడ పెద్దసముద్రం ఉంది.

విజయ—(ఆశ్చర్యంతో) పెద్దసముద్రమా! బందరు సముద్రానికన్నా పెద్దదా?

రాముడు—ఇక్కడ సముద్రం నీవు చూశావా?

విజయ—మాఅమ్మ సముద్రస్నానానికి తీసికెళ్ళింది లే.

రాముడు—ఇక్కడ సముద్రము ఏముంది లే. వెధవది. అవతలొడ్డు కనిపిస్తానే ఉంటుంది.

విజయ—అవతలొడ్డుకనిపిస్తుంది? ఆ తెలివిగలవాడవె?

రాముడు-కనిపించ కేమే! నీవు చూశావా. పెట్టావా? మద్రాస్ దగ్గర సముద్రం అంటే...అదే అసలు నిజమైన సముద్రం. ఎంత పెద్దదనుకొన్నావేమిటి? అబ్బ చెప్పలేం. తలకాయ గిర్రున తిరిగిపోతుంది.

విజయ—(ఆశ్చర్యంతో) అబ్బగుంటూరులోఉందిరా సముద్రం.

రాముడు—గుంటూరులోనా, ఆ......గుంటూరు లో సముద్రం అదో తమాషా సముద్రం.

విజయ—ఏమిటి? ఏమిటి తమాషా చెప్పవు.

(దగ్గరకు వస్తుంది)

రాముడు—అదోతమాషా లే. ఇన్ని సముద్రాలున్నాయా గుంటూరుసముద్రంలాంటిది నేనెక్కడా చూడలేదు.

విజయ—తమాషా ఏమిటో చెప్పరాదో యమ్మ ఊరికే ఊరిస్తావు కానీ.

రాముడు—అదిఏమిటంటే చెప్పనా? సముద్రంలో నీళ్ళు ఎల్లా ఉంటాయి చెప్పు.

విజయ—నల్లగా ఉంటాయి.

రాముడు—అవునామరి. గుంటూరు సముద్రములో నీళ్ళు ఎర్రగా ఉంటవి.

విజయ—ఎర్రగా నే—అంటే కుంకంలాగ?

రాముడు—కుంకంఏమిటే...రక్తంలాగ.

విజయ—అయ్యబాబో...రక్తంలాగ ఎర్రగాఉంటాయన్నమాట! తాతయ్యగారింటికి వెళ్ళినప్పుడు నేను అది చూడలేదురా.

రాముడు—నీవేంచూస్తావ్. ఆడపిల్లవు మీఅమ్మతో పాటు ఇంట్లో ఉంటావు. కాకపోతే ఎక్కడికైనా పేరంటానికి వెడతావు అంతేగా? మామయ్యకు అసలే భయం నిన్ను ఎక్కడికైనా తీసికెళ్ళటానికి, మనంఇద్దరం వెడదాంరా? నీకన్నీ చూపిస్తా. ఆ సముద్రం కొండలు అవన్నీ చూపిస్తా.

విజయ—నీవు ఎప్పుడన్నా కొండ ఎక్కావ్ బావా?

రాముడు—ఓ. కొండ చివాఋకొమ్మకెళ్ళా.

విజయ—కొండలకు కొమ్మలుంటాయా, (నవ్వు)

రాముడు—కొమ్మంటే ఆచివరకెళ్ళానన్నమాట.

విజయ—అమ్మో భయమేయ లేదూ ?

రాముడు—మొగాళ్ళ కేం భయం ... నిన్నుకూడా తీసికెడతా, రా

విజయ—అమ్మయ్యో, ? నేను కొండ మీదికి రాను బాబూ, ఆచివర ఏముంటుంది. అక్కడ నుంచుంటానికి వీలేనా ? పడిపోగా ?

రాముడు—ఆచివర ఎట్లా ఉంటుందను కొన్నావు ? ...అదో తమాషాగా ఉంటుంది. నీవైతే వా కళ్ళుగిర్రున తిరిగి పడిపోతావు.

విజయ—మరి నీ వెట్లా వున్నావు !

రాముడు—మరి నీ మోస్తరు నేను ఆడపిల్లనా ? మరి ఆకొండ ఎక్కుతుంటే... పెద్దపులులు అవీ అరుస్తూ ఉంటం వినపడుతుంది.

విజయ—పెద్దపులు లే— అయ్యబాబో !— నేను రాను బాబూ. నేను అసలు రాను.

రాముడు—ఓసి, ఊరికే నే భయపడతావే మే. పగలు ఉండవు అవీ! రాత్రిళ్ళు తిరుగుతూ ఉంటవి.

విజయ—రాత్రిళ్ళు మనం అక్కడకి పోగూడదన్న మాట.

రాముడు—ఆఁహో...అయితే తుపాకి అవీ ఉంటే వెళ్ళి వాటిని చంపొచ్చు.

విజయ—నీవు చంపగలవ్రా పెద్దపులిని ?

రాముడు—నేనా? పెద్దపులినా ? ఆ రాత్రిళ్ళ ఆఁహో చిన్నపిల్లలు చంపలేరే ! పెద్దఅయిన తరువాత తప్పకుండా

చంపుతా. అసలు పెద్దపులులను సింహాలను వేటాడాలని నాకు సరదా.

విజయ—పెద్ద అయిన తరువాత చంపుతావా ?

రాముడు—ఓ......

విజయ—తాతయ్య గారింటికెళ్ళితే తాతయ్య కోప్పడ్డూ ?

రాముడు—తాతయ్యా ఏం కోప్పడ్డు. బలే సంతోషిస్తాడు. మానాయినే, మాఅమ్మో, అంటూ ఎత్తుకొంటాడు కాసేపు అయిన తరువాత తాతయ్యా, తాతయ్యా, మేమిద్దరం పెండ్లిచేసుకుంటాం అని చెపుదాం తాతయ్య మర్నాటికల్లా లగ్నం కుదిర్చి జైమంటూ పెండ్లిచేస్తాడు.

విజయ—అమ్మా, నాన్నా రావద్దా ?

రాముడు—అన్నీ సిద్ధం అయిన తరువాత వస్తారూ.

విజయ—వచ్చి కోప్పడరూ ?

రాముడు—పెండ్లిఅయిపోయినతరువాత ఏం జేస్తారూ?

విజయ—నిజం పెండ్లేనా ?

రాముడు—ఆ; నిజం పెండ్లే?

విజయ—బాజాలూ మరి ?

రాముడు—బాజాలూనూ ?

విజయ—గాసులైట్లూ ?

రాముడు—గాస్‌లైట్లేం కర్మం! ఎలక్ట్రిక్ లైట్సు పెట్టిద్దాం.

విజయ—మరి మనకు కొత్తబట్టలూ ;

రాముడు—తాతయ్య కొని ఇస్తాడు.

విజయ—అవునురా? బలేతమాషాగా ఉంటుందిగదూ?

రాముడు—గమ్మత్తు. మరి వెడదాం ఎవరికీ తెలియకుండా.

విజయ—అమ్మో మరినాకు ఆకలై తేనో?

రాముడు—నాదగ్గర డబ్బు ఉందిగా, ఇదిగో

విజయ—అయ్యబాబో ఎక్కడదమ్మా ఆనోటూ

రాముడు—ఎక్కడో సంపాదించాను వెడదాంరా. నీకు బొమ్మలూ అవి కొనిపెడతాను.

విజయ—మొగ్గలేసే బొమ్మకొంటావా!

రాముడు—ఒక్క మొగ్గేసేదేనా? మొగ్గలేసేవీ, ఉయ్యాలలూగేవి డ్యాన్సు చేసేవి, అవన్నీ కొంటా!

విజయ—నిజంగా

రాముడు—వెడదాం—మరి ఎవ్వరితో చెప్పకుండా?

విజయ—అమ్మతో చెప్పిరానా?

రాముడు—ఛాదద్దమ్మా, చెప్పిందంతా వినిఅమ్మతో చెపుతానంటావేం. చెపితే మన పెండ్లికాదు, పైగా రెండు తంతుంది.

విజయ—మరి ఎవరితో చెప్పేది?

రాముడు—పిచ్చి మొద్దూ? ఒకరితో చెపటం ఎందుకూ? వెళ్ళిపోదాం.

విజయ—ఒక్కళ్ళమే. నేను రాను.

రాముడు—ఛా తమషాగా వెడదాంరా.

విజయ—అమ్మగనక ఏమన్నా అన్నదాఅంటేనీ మీాద చెపుతానబ్బాయ్.

రాముడు—ఓ. ఏమన్నా చెప్పు—నేను కాదనను. నేను—నిన్ను... పెండ్లి చేసుకొంటే................. నీవు...నాకు ఏమవుతావూ?

విజయ—నీవు నాకూ మొగుడవురా.

రాముడు—నీవూ నాకు పెళ్ళానివే. (తెర)

2

(స్థలం మేడపైన గది. గదిలో విజయ ఉంటుంది అప్పుడే స్నానంచేసివచ్చి బట్టమారుస్తుంటుంది. రాముడూ స్నానంచేసి మంచిబట్టలు వేసుకొన్నాడు నిక్కర్ తొడిగాడు పైన తెల్లనిషర్టు కాలరుపైకి నెట్టి స్పోర్ట్సుమేన్ లాగా తయారయినాడు పచారుచేస్తూ)

రాముడు—'రిస్టు వాచి చూచుకొని' ('స్వ') రాదేల ఇంకా ఈవిడ. సాయంత్రం ఆరు గంటల బండి అందుతుందో అందదో ఆబండి తప్పితే ఇంకో బండి ఉందిగాని, ఇంతలోకే మామయ్య వచ్చినా, కథ అడ్డంతిరుగుతుంది లేకపోతే అత్తయ్యకుఆచూకీపోకేనా, పక్కలువిరగపొడుస్తుంది. ఈయిద్దరికీ అందకుండా, సంజె చీకట్లో దొడ్డి గుమ్మాన ఉడాయించాలె. ఇంకా ఈవిడ రాదేం? ('ప్ర') విజయ లక్ష్మీరాణీసాహెబా

వారు...మహారాణివారూ, కదిలి రండమ్మా, అమ్మగారి సింగారం పూర్తి అయిందా ?

విజయ—(ప్రవేశించి) అథార్టీ చేస్తున్నావే అప్పుడే?

రాముడు—పెండ్లాం మీద అథార్టీ చెయ్యరావేమిటి? మొగాళ్ళు.

విజయ—అబ్బో మహాదొడ్డ మొగాడివి దిగొచ్చావు లెద్దూ? అసలు నీవు నేను... పెళ్ళాన్ని అయితేకద.

రాముడు—నీవు నాకు పెళ్ళానివి కాదూ?

విజయ—కాదు, నేను నీ పెళ్ళాన్ని కాదుపో.

రాముడు—ఎం చేత ?

విజయ—నీకూ నాకూ ఇంకా పెండ్లి కాందే?

రాముడు—ఒస్ ఇంతేకదా, రేపు అవుతుంది.

విజయ—అవుతూంది, అవుతూంది— అబ్బాయికి పెండ్లి ఎట్లాగు అవుతుంది.

రాముడు—కాకపోయినా నాకు కాబోయే పెళ్ళానివి కాబట్టి నీమీద నాకు అథార్టీ ఉంది తెలిసిందా ? కాబట్టి అథార్టీ చేస్తాను.

విజయ—చేస్తావు, చేస్తావు, చేస్తే ఎరగవ్వూ?

రాముడు—ఏమిటేవ్ విజయా, నీవు జూస్తే పెంకె మనిషి లాఉన్నావే! నేను నీకు మొగుడ్ని, కాబట్టి నేను చెప్పినట్లు నీవు వినాలె.

విజయ—నేనువినను—నీవు నాకు మొగుడివి కాదుపో,

రాముడు—అమ్మబాబో నేను నీతో వేగలేనేవ్. అయితే ఇంతకూ ఒక్కటి చెప్పూ నీవునాకు పెళ్ళానివిఅవునా కాదా, అసలు ఆసంగతి చెప్పూ?

విజయ—కాదు. నేను నీపెళ్ళానిని కాదూ (దీర్ఘాలు తీస్తూ)

రాముడు—అట్లాగయితే ఎట్లాగమ్మా, ఇందాక సరే నంటివే గుంటూరు వెళ్ళి గమ్మత్తుగా పెండ్లిచేసుకొందాం అంటివిగదే, మళ్ళీ ఇప్పుడిదేమిటమ్మా('దగ్గరకు వెళ్ళి')ఏమే విజయా?...('మెడమీద స్నేహపూర్వకంగా చేయివేసి') మరి నన్ను పెండ్లిచేసుకోవూ?

విజయ — చేసుకుంటా.

రాముడు—అదిగో విజయ ఎట్లాగైనా మంచిదే. విజయ చాలా మంచిపిల్ల. అందరి పిల్లల్లోకి విజయమంచిపిల్ల. అన్ని సబ్బుల్లోకి నల్లసబ్బు మంచిది. విజయా మరి బయలు దేరూ వెడదామూ.

విజయ—ఎక్కడికీ ?

రాముడు—మళ్ళీ ఎక్కడికీ అంటావేమే? గుంటూరు వెళ్ళటం, పెళ్ళిచేసుకోటం. అదంతా అనుకొన్నాంగదే.

విజయ—అమ్మో నేను గుంటూరురాను బావా, నీకు కోపం వస్తే వచ్చింది. అమ్మకోపం వస్తుంది చెప్పకుండా వెడితే.

రాముడు—అయితే నీవు రావా?

విజయ—రాను...నవ్వుతూ,

రాముడు—అయితే నామాట వినవన్నమాట.

విజయ—వింటా

రాముడు—అదీ జయరాణి ఎట్లాగయినామంచిపిల్లే!

జయ ఎంతో మంచి పిల్ల
గయ్యాళి, గయ్యాళికాని పిల్ల
కయ్యాలు, కయ్యాలు లేనిపిల్ల
జయ ఎంతో మంచి పిల్ల.

ఏమ్మే జయ నీవు మంచి పిల్లవు కావూ?

విజయ —మంచిదాన్ని.

రాముడు—('ముద్దుపెట్టుకొని') నేనో

విజయ—నీవూ మంచి వాడవే.

రాముడు—మరి నేను చెప్పినట్లు వింటావా

విజయ—ఊఁహు

రాముడు—ఇందాక వింటానంటివి కదే?

విజయ—వింటా, వింటా, ఊహు, వినను, ఊపోన్లే వింటానురా బావా వింటానులేరా.

భిక్షకబాలుడు—ముక్కుపచ్చలా — చిన్నాదానా
ఎక్కుతావా రైలూ బండీ
చక్కదనమూ—చూచినిన్నూ
ఎక్కనివ్వడో—జాతీవాడూ

(అని పాడుతూ ఉంటాడు.)

విజయ—'భయంతో' వీడికెట్లా తెలిసింది బావా అమ్మతో చెపుతాడేమో!

రాముడు—ఛా, వాడెవడో పాడుకొంటూ పోతున్నాడు బజార్లో, నీకేంభయం, ఇహ బయలు దేరుదాం.

విజయ—అమ్మో నాకు భయంగా ఉందబ్బా.

రాముడు—నీకేం భయంలేదు. నేనున్నానుగా, దొడ్డిగుమ్మం దగ్గరుంటా నేను ముందెళ్ళి. నీవు మెల్లగా ఎవ్వరూ చూడకుండా వెళ్ళిపోయిరా ఏం?

విజయ—సరేముందు నువ్వెళ్ళు.

పంతులు—(ప్రవేశించి) విజయతల్లీ ఎక్కడికమ్మా వెళ్ళుతున్నావూ?

విజయ—(భయంతో) ఎక్కడికి లేదునాన్నా.

పంతులు—చీకటిపడ్డది. దొడ్లోకి వెళ్ళేవు పురుగూ బుట్రా)ఉంటాయి. అయితే అమ్మాయీ నాజేబులోనుంచి ఏదైనా తీశావా నువ్వు?

విజయ—నేనేం తీయలేదునాన్నా, నేనేమెరుగుదునూ!

పంతులు—మరి ఏమైపోయిందే పదిరూపాయల నోటూ, పొద్దుటినుంచీ వెతుక్కుని చస్తున్నాను. తీస్తే నీవే తీయాలెప్పుడన్నా కానీ అర్ధనా తీస్తూవుంటావు.

విజయ—నోటు నాకెందుకు నాన్నా, నేను నోటు తీస్తానేమిటీ!

పంతులు—ఎవరి దగ్గరైనా నోటుచూశావా? పోనీ అది చెప్పు?

విజయ—చిన్న కాయితం గదు నాన్నా?

పంతులు—ఆ. ఆ, ఇంత కాయితం.

విజయ—దాని మీాద అక్షరాలుంటవీ!

పంతులు—ఆ, అదే ఎక్కడుంది?

విజయ—అది స్తే రూపాయలిస్తారు కదునాన్నా?

పంతులు—ఆ, అదేనే ఎక్కడుంది, ఎవరుతీశారు?

విజయ—ఏమో నాన్నా

పంతులు—భడవా, నీకేదో తెలుసు నిజంచెప్తావా చెప్పవా? ('చెయ్యెత్తికొట్టబోతాడు')

విజయ—నేగాదు నాన్నా తీసింది.

పంతులు—పోనీ ఎవరు తీశారో చెప్పు?

విజయ—ఎవరుతీశారో నాకు తెలియదు నాన్నా. బావదగ్గర అటువంటి దొకటుంటే చూశాను.

పంతులు—ఆసి భడవా, ఇందాకటినుంచీ ఆమాట చెప్పవేం? ఏడీ వెధవ? ఎక్కడున్నాడు.

విజయ—దొడ్డిగుమ్మం దగ్గరున్నాడు.

పంతులు—రా, చూపిద్దువుగాని రా వెధవ దొంగ తనంకూడా నేర్చాడూ?

('నిష్క్రమణం')

...

విజయ—'దొడ్డిగుమ్మం దగ్గర ప్రవేశించి' బావా?

రాముడు—(గొంతుక బిగబట్టి గుసగుసలాడినట్టుగా) 'రావే విజయా, గుంటూరు బండికి టైము అయింది...

పంతులు—(ప్రవేశించి)'రాముడ్ని చెయ్యిపట్టుకొని' ఏమిట్రా, ప్రయాణమా? ఇద్దరుకలిసి వెడదామనుకొన్నారూ ఓరి వెధవా, నోటుఏది ?

రాముడు—ఏం నోటూ? నేనేమెరుగుదునూ?

పంతులు—నా జేబులోనుంచి నోటుతీయలా?

కాంతమ్మ—వాడేమెరుగునండి, పాపం వాడ్ని కొట్టబోతారూ, చిన్నవెధవనూ?

విజయ—నోటు తెచ్చాడే అమ్మా, నేను చూశాను, నాకు చూపాడుకూడాను. మనంఇద్దరం గుంటూరుతాతయ్యగారింటికి వెడదాం అన్నాడే. మనం అక్కడ పెండ్లి చేసుకుందాం అని కూడా అన్నాడే అమ్మ.

పంతులు—నీవుకూడా వున్నావూ ఈ కుట్రలో ?

విజయ—నే నే మెరుగను నాన్నా! బావే నన్ను గుంటూరు తీసికెడతానంటే నేను రానన్నాను నాన్నా.

కాంతమ్మ—కానీపు మీరు రాకపోయి నట్టయితే కట్నమూ కానుకా లేకుండా, మీకూతురుకు మొగుడొచ్చేవాడు. ఇంతకూనోటు మీ చేతికొచ్చిందా !

పంతులూ—రాలేదు. వాడేం ఎరగట్ట!

విజయ—బావదగ్గర నోటువున్నది నాన్నా

పంతులు—ఏంరా రాముడూ ?

రాముడు—నేను తియ్యలేదు—ఇదిగోనోటు నేను తియ్యలేదూ—

పంతులు—తియ్యలేదూ, వెధవాతీయందే ఎట్లా వచ్చింది నీదగ్గరకు? (ఒక దెబ్బకొడతాడు)

కాంతమ్మ—వాడ్ని కొడతారెందుకూ? మీరిట్లా ఉండండి. ఏమిట్రా రామూ నోటు నీవు తీశావా?

రాముడు—నేను తీయలేదు అత్తయ్యా...మావయ్యగదిలోనే కింద పడేసుంది ఆనోటు, ఎవరన్నా తీస్తే ఎత్తికెడతారని నేను తీసుకొన్నాను.

కాంతమ్మ—ఎంతబుద్ధిమంతుడివిరా మాతండ్రీ.

పంతులు—ఛా. గాడిదా అబద్ధాలు కూడాను. తన్నేవాళ్ళులేక (ఇంకోదెబ్బ)

కాంతమ్మ—ఊరుకోండి చెయ్యిచేసుకోవటం ఎందుకూ?

విజయ—అక్కయ్యారా, దబ్బునరావాలె, చిన్నన్నయ్యా, పెద్దన్నయ్యా అరెరె, చప్పునరావాలె, అదుగో బావ పెండ్లి అయింది...బావకు పెండ్లి అయింది...నేజెప్పలా...బావకు పెండ్లి అయింది.

("పిల్లలంతాచేరి కిలాకిలా నవ్వుతారు")

జయ పాడుతుంది.

అయిందమ్మా అయిందీ
బావకు పెండ్లి అయిందీ

వేళంతాళం లేకుండా,
దమ్మిడికర్చూ లేకుండా
పెద్ద పెళ్ళి అయింది.
నాన్నకోపం వచ్చిందీ
నాలుగు తన్నులూ తన్నాడూ,
అయిందమ్మా అయింది
బావకు పెండ్లి అయిందీ.
"అంటూ ఎగురుతుంది"

(తెర పడుతుంది.)

సంపూర్ణము